http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 29 డిసెంబర్ 2024

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828





# ఇక సెలవు!

- అశ్రునయనాల మధ్య సంస్కరణలకర్తకు తుది వీడ్కోలు..
- నిగమ్‌బోధ్ ఘాట్‌లో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు పూర్తి!
- మన్మోహన్ పాడె మోసిన రాహుల్ గాంధీ
- చితికి నిప్పు అంటించిన మన్మోహన్ కుమార్తె
- సిక్కు సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు
- అంత్యక్రియలకు హాజరైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని

2

నిగమ్ బోధ్ ఘాట్‌లో భారత మాజీ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, నవ భారత నిర్మాత మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్ని కేంద్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అశ్రు నయనాలతో మాజీ ప్రధాని మన్మోహన్‌కు పార్టీలకతీతంగా నేతలు కడసారి వీడ్కోలు పలికారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, తదితరులు పాల్గొన్నారు.పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య, రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ ప్రముఖులు మన్మోహన్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఢిల్లీ నిగంబోధ్ ఘాట్ వద్ద మన్మోహన్ సింగ్ అంత్యక్రియలలో తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్, రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు పాల్గొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించి తుది వీడ్కోలు పలికారు.



## మా పథకాలకు భయపడే బీజేపీ అడ్డుకుంటోంది

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం
- తమ పార్టీని ఎదుర్కొనే ధైర్యం లేక బీజేపీ... కాంగ్రెస్‌ను అడ్డుపెట్టుకుంటుందని విమర్శ
- ప్రజలకు అందిస్తున్న పథకాలను దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపాటు
- తమ పార్టీ ఇచ్చిన హామీలతో బీజేపీ భయపడుతోందని విమర్శ

# పదవుల కోసం పడిగాపులు

- పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం జరిగి నాలుగు నెలలు పూర్తయింది
- ఇప్పటివరకు పార్టీ కార్యవర్గాన్ని కూడా భర్తీ చేయట్లేదు.
- ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడం లేదు
- నామినేటెడ్ పోస్టుల భర్తీ కొలిక్కి తేవడం లేదు
- దీంతో పదవుల రేసులో ఉన్న నేతలకు రోజులు భారంగా గడుస్తున్నాయట.



హైదరాబాద్

క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అలా ఉంటే.. పార్టీ పరంగా నియమించాల్సిన పోస్టుల్లో కూడా ఆలస్యం అవుతోంది. పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం జరిగి నాలుగు నెలలు పూర్తయింది. ఇప్పటివరకు పార్టీ కార్యవర్గాన్ని కూడా భర్తీ చేయట్లేదు. దీంతో పార్టీ పోస్టులపై ఆశలు పెట్టుకున్న నేతలకు కూడా నిరాశ తప్పడం లేదు. పార్టీ కార్యవర్గం విషయంలో సీనియర్ - మిగతా3లో

## అక్రమ నిర్మాణాలపై హైడ్రా మరింత దూకుడు

- త్వరలోనే హైడ్రా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తాం..
- కూల్చివేతలు మళ్లీ స్టార్ట్ అవుతాయి..
- కీలక విషయాలు వెల్లడించిన రంగనాథ్
- కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటా
- చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోంది
- స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుంది



హైదరాబాద్

ప్రజల్లో అవగాహన కల్పించేందుకే మొదట్లో దూకుడుగా వ్యవహరించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. దీనివల్ల ఇప్పుడు ప్రజలకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పై అవగాహన ఏర్పడిందని పేర్కొన్నారు. ఒక ప్రాపర్టీ కొనేముందు ఎఫ్‌టీఎల్/బఫర్‌జోన్‌లో ఉందా? లేదా? అనే విషయాన్ని చూసుకుంటున్నారని అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైడ్రా వార్షిక నివేదికను రంనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. త్వరలోనే హైడ్రా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న చెరువులు, ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడుతుందని రంగనాథ్ స్పష్టం చేశారు. 2 వేల - మిగతా3లో

## జోష్ నింపిన న్యూఇయర్..

సిమ్లా, మనాలికి పోటెత్తిన పర్యాటకులు..

హిల్ స్టేట్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

సిమ్లా, మనాలి, కసోల్ తదితర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి

మరోవైపు భారీగా వాహనాలు రావడంతో ట్రాఫిక్ రద్దీ

# జనవరి 7న విచారణకు రండి


- అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్‌కు, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి ఈడీ నోటీసులు
- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కేసు కింద ఈడీ విచారణ
- ఫార్ములా ఈ రేసుపై విచారణలో ఏసీబీ దూకుడు
- ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో ఏ1గా ఉన్నారు కేటీఆర్



హైదరాబాద్

ఫార్ములా ఈ-రేసు కేసు విచారణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, ఏసీబీ దూకుడు పెంచింది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 7న విచారణకు హాజరు కావాలని పేర్కొంది. కేటీఆర్‌తోపాటు అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్‌కు, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. అరవింద్ కుమార్ జనవరి 2న, బీఎల్ఎన్ రెడ్డి జనవరి 3న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కేసు కింద ఈడీ విచారణ జరుపుతోంది.మరోవైపు? ఫార్ములా ఈ రేసుపై - మిగతా3లో

## శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలు కాదు.. ఇవి ఇవ్వండి



- ఎన్టీఆర్ స్టేడియంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్
- సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉందని వెల్లడి
- ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుందని వ్యాఖ్యలు

హైదరాబాద్

ఏవైనా శుభకార్యాలకు వెళ్లినప్పుడు అందరూ బొకేలకు బదులుగా మంచి పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉందన్నారు. పుస్తకాలను నమిలి మింగేసేంత క్షుణ్ణంగా చదవాలని సూచించారు. ఈ-బుక్స్‌లలో కంటే పుస్తకాల్లోనే ఎక్కువ మజా - మిగతా3లో

# ఇక సెలవు!

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. సైనిక లాంఛనాలతో మన్మోహన్ అంత్యక్రియలు జరిపారు. నిగంబోధ్ ఘాట్‌లో మన్మోహన్ భౌతికకాయానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా నివాళులర్పించారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మన్మోహన్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అశ్రునయనాల మధ్య సంస్కరణల యోధుడికి తుది వీడ్కోలు పలికారు అభిమానులు. నిగమ్‌బోధ్ ఘాట్‌కు మన్మోహన్ అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చి నివాళులర్పించారు.


అంతకుముందు ఏఐసీసీ ఆఫీస్‌లో మన్మోహన్‌కు ప్రజలు, కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఏఐసీసీ ఆఫీస్ నుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు మన్మోహన్ అంతిమయాత్ర కొనసాగింది. అంతిమయాత్ర వాహనంలోనే రాహుల్ గాంధీ నిగమ్‌బోధ్ ఘాట్‌కు వచ్చారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు మన్మోహన్ సింగ్‌కు ఘననివాళులర్పించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంపీ మల్లురవి మన్మోహన్‌కు అంజలి ఘటించారు. ఏపీ కాంగ్రెస్ నేతలు పల్లంరాజు, కేవీపీ రామచంద్రరావు మన్మోహన్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు యావత్ దేశం అంతిమ వీడ్కోలు పలుకుతున్న సందర్భం ఇది. యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ అనీ, మౌనముని అని ముద్రపడిన మన్మోహన్ చేసిన సేవలను ఆసేతుహిమాచలం గుర్తుచేసుకుంటోంది. 1991 నుంచి 2024 వరకు- దేశనిర్మాణంలో ఆయన పాత్రను నిన్నటితరం నెమరువేసుకుంటోంది. ఆయన సేవలను ఈ తరం తెలుసుకుంటోంది. మన్మోహన్ సింగ్ 1991లో ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టినా, 2004లో ప్రధాన మంత్రిగా ప్రమాణం చేసినా, ఆయన జీవితంలో అన్నీ యాక్సిడెంట్లే. కానీ ఈ అనుకోని ఘటనలు, దేశానికి మేలు చేశాయి. మేలు చేయడమే కాదు, దేశాభివృద్ధికి బాటలు పరిచాయి.

మన్మోహన్ సింగ్ మౌనంగా ఉండే ఆర్థిక మేధావే అయినా, అంతే దీటుగా జవాబు ఇచ్చే మిస్టర్ పర్‌ఫెక్ట్ కూడా. ఆర్థికమంత్రిగా మన్మోహన్ ఫస్ట్ స్పీచ్ నుంచి, ప్రధానిగా చివరి స్పీచ్ వరకు మన్మోహన్‌లో ఇదే ధోరణి కనిపించింది. ఎలాంటి మాటలదాడి జరిగినా, ఎలాంటి విమర్శలు వచ్చినా ఎదుర్కోవడానికి తాను సిద్ధమంటూ 1991 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మన్మోహన్ వ్యాఖ్యానించారు. చివరిగా 2014లో ప్రధాని పదవి నుంచి గుడ్‌బై చెప్పే సందర్భంలోనూ, ప్రెస్‌మీట్‌లో ఇలాగే మాట్లాడారు. తాను విలేకరుల సమావేశాలకు భయపడే ప్రధానమంత్రిని కానంటూ మన్మోహన్ సింగ్ నాటి ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు, ఇప్పుడు జనం గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

**దీంతోపాటు వీళ్లు కూడా..**

ఆర్మీ ఫిరంగి రైలులో పార్థివ దేహాన్ని నిగంబోధ్ ఘాట్‌కు తరలించారు. రాహుల్ గాంధీ మృతదేహంతో వాహనంలో కూర్చుని అక్కడకు వచ్చి నివాళులు అర్పించారు. ఘాట్ వద్ద కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



సహా పలువురు కాంగ్రెస్ నేతలు హాజరై నివాళులర్పించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల నిమిత్తం భూటాన్ రాజు, మారిషస్ విదేశాంగ మంత్రి భారత్ చేరుకున్నారు. అంతకుముందు శుక్రవారం ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము సహా దేశంలోని నాయకులందరూ ఆయన నివాసంలో నివాళులర్పించారు.

**అణు ఒప్పందంలో కీలక పాత్ర**

భారత్, అమెరికాల మధ్య పౌర అణు ఒప్పందంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారు. అమెరికా మాజీ విదేశాంగ మంత్రి కండోలీజా రైస్ కూడా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్రను గుర్తు చేసుకున్నారు. ఆయనను గొప్ప నాయకుడిగా అభివర్ణించారు. రెండు దేశాల మధ్య చారిత్రక పౌర అణు ఒప్పందం ద్వారా అమెరికా-భారత సంబంధాలను ప్రాథమికంగా కొత్త స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన సహాయం చేశారని కండోలీజా అన్నారు.

**ఆర్థిక సంస్కరణల విషయంలో**

అంతర్జాతీయ ద్రవ్య నిధి మొదటి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన గీతా గోపీనాథ్.. సింగ్ 1991 బడ్జెట్ గురించి ప్రస్తావించారు. ఇది మిలియన్ల కొద్దీ భారతీయుల ఆర్థిక అవకాశాలను గణనీయంగా మెరుగుపరిచిందని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ %శ% లో పోస్ట్ చేశారు. సింగ్ మరణం భారతదేశానికి, ప్రపంచానికి తీరని లోటు అని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కూడా సంతాపం తెలిపారు. ఈ క్రమంలో దీర్ఘకాలం పనిచేసిన నాయకులలో ఒకరిగా, ఆయన దేశ ఆర్థిక వ్యవస్థను మార్చారని పేర్కొన్నారు. లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేలా చేశారని వెల్లడించారు. కెనడాతో సహా ప్రపంచంతో బలమైన సంబంధాలను నిర్మించారని గుర్తు చేసుకున్నారు.

**చక్వాల్లో జన్మించిన మన్మోహన్**

పంజాబ్ (ఇప్పటి చక్వాల్ , పాకిస్తాన్) లో 1932 సెప్టెంబరు 26న జన్మించారు మన్మోహన్ సింగ్. పంజాబ్ యూనివర్సిటీ నుంచి 1952లో ఎకనామిక్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ, 1954లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి 1957లో బ్యాచిలర్స్, 1962లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పూర్తి చేసిన మన్మోహన్ సింగ్ 1957-59లో ఆర్థికశాస్త్రం లెక్చరర్ గా చేశారు.

1963-65 పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రం ప్రొఫెసర్‌గా , 1969-71 కాలంలో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో, 1976 లో జేఎన్‌యూ న్యూఢిల్లీలో బాధ్యతలు చేపట్టారు.

**రాజ్యసభ సభ్యుడిగా సేవలు**

1991 అక్టోబరు 1 నుంచి 2019 జూన్ 14 వరకు ఐదు పర్యాయాలు అస్సాం నుంచి రాజ్యసభ సభ్యునిగా సేవలు అందించారు. 2019 ఆగస్టు 20 నుంచి 2024 ఏప్రిల్ 3 వరకు రాజస్థాన్ నుండి రాజ్యసభ సభ్యునిగా చేశారు. 1991లో ఆర్థిక శాఖ మంత్రిగా ఆర్థిక సంస్కరణలతో భారతదేశాన్ని మళ్లీ గాడిన పెట్టారు. ఆపై 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ సేవలు అందించారు.

1971-72లో ఆర్థిక సలహాదారుగా సేవలు

1972-76లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో ప్రధాన సలహాదారుడుగా కీలకపాత్ర.

1976-80 మధ్య కాలంలో భారత రిజర్వు బ్యాంకు డైరెక్టర్‌గా

1980 ఏప్రిల్ - 1982 సెప్టెంబరు 15 కాలంలో ప్లానింగ్ కమిషన్ సభ్యుడు- కార్యదర్శిగా సేవలు

1982 - 1985 జనవరి 14లో రిజర్వ్ బ్యాంకు గవర్నరు

1983-84లో ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారుల కౌన్సిల్ సభ్యుడు

1985 జనవరి 15 నుంచి 1987 జూలై 31 వరకు ప్లానింగ్ కమిషన్ డిప్యూటి ఛైర్మన్‌గా సేవలు

1990 - 1991 మార్చి 14లో ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారుడు

1991 మార్చి 15 నుంచి 1991 జూన్ 20 వరకు యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్

# మా పథకాలకు భయపడే బీజేపీ అడ్డుకుంటోంది

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక బీజేపీ... కాంగ్రెస్ పార్టీని అడ్డుపెట్టుకుంటుందని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మండిపడ్డారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఎల్‌జీ సెక్రటరియేట్ తాజాగా విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంపై కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు.

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమను అడ్డుకోవడానికే ఇవన్నీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలకు తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాము మరోసారి గెలిస్తే మహిళా సమ్మాన్ యోజన కింద మహిళలకు ప్రతి నెల రూ.2,100 ఆర్థిక సాయం, సీనియర్ సిటిజన్లకు అన్ని ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించామని గుర్తు చేశారు. ఇందుకోసం ఇప్పటికే చాలామంది నమోదు చేసుకుంటున్నారని తెలిపారు.

ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై విచారణకు లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు ఆదేశించడంపై ఆ పార్టీ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ (%ూతీజఱఅం ఖవయతీఱఝశ్రీ%) స్పందించారు. నిరాధారమైన విచారణతో తమ పార్టీ 'మహిళా సమ్మాన్ యోజన'ను బలహీనపరచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు



ముంచుకొస్తున్న వేళ తమ తమ పార్టీ పథలకు చూసి బీజేపీ భయపడుతోందని, వాటిని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను అడ్డుపెట్టుకుందని శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆయన అన్నారు. 'మహిళా యోజన పథకం' కింద మహిళలకు రూ.2,100 చొప్పున నెలవారీ ఆర్థిక సాయం, 'సంజీవని యోజన' పథకం కింద 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత వైద్య చికిత్సను 'ఆప్' ప్రకటించింది. తాము ప్రకటించిన రెండు పథకాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండటం, లక్షలాది మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకాలను ఆప్ విజయవంతం చేసినట్లయితే బీజేపీకి అనేక నియోజకవర్గాల్లో గట్టిదెబ్బ తగులుతుందని, చాలాచోట్ల డిపాజిట్లు కూడా కోల్పోతుందని ఆ పార్టీనేతలే తనతో చెబుతున్నారని తెలిపారు.

ఆప్ చేసిన రిజిస్ట్రేషన్ క్యాంపులు విజయవంతం కావడంతో బీజేపీ బెదిరింపు ఎత్తుగడలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. క్యాంపులను చెల్లాచెదురు చేసేందుకు దుండగులను, పోలీసులను ఉసిగొలుపుతోందని అన్నారు.

రాజకీయ దురుద్దేశాలతోనే..

బీజేపీ రాజకీయ కారణాలతోనే ఆప్ పథకాలపై నకిలీ విచారణకు ఆదేశించినట్టు ఆయన చెప్పారు. "ఏమి ఇన్వెస్టిగేషన్ చేస్తారు? మేము కేవలం ఎన్నికల వాగ్దానం చేశాం. మేము గెలిస్తే ఆ పథకాలను అమలు చేస్తాం. కేవలం మేము చేసింది అంతే" అని అన్నారు. బీజేపీ తమ చర్యల ద్వారా ఆ పార్టీ అధికారంలోకి వస్తే మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన, మహిళలకు ఇస్తున్న ఉచిత బస్సు సేవలు, ఉచిత విద్యుత్, నీళ్లు, మొహల్లా క్లినిక్‌లను నిలిపివేస్తారనే స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని ఆయన విమర్శించారు.

**జైలుకు వెళ్లేందుకు వెనుకాడను**

ఆప్ పథకాలను అడ్డుకునేందుకు కాంగ్రెస్‌ను బీజేపీ అడ్డుపెట్టుకుంటోందని, ఆప్‌ను అడ్డుకోవాలని రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని కేజ్రీవాల్ ఆరోపించారు. "ప్రజల కోసం మళ్లీ జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాను. ఈ దేశం వారి పూర్వీకుల ఆస్తి కాదు. ఓట్ల కోసం బహిరంగంగా డబ్బులు పంచుతున్న వ్యక్తిని వాళ్లు ఎందుకు ఆపడం లేదు" అని కేజ్రీవాల్ సూటిగా బీజేపీని ప్రశ్నించారు.

# మన్మోహన్‌సింగ్ మృతిపట్ల జో బైడెన్ సంతాపం

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన 'నిజమైన రాజనీతిజ్ఞుడు', 'గొప్ప ప్రజా సేవకుడు' అంటూ కొనియాడారు. 'మన్మోహన్ సింగ్ ఓ గొప్ప రాజనీతిజ్ఞుడు. అద్భుతమైన ప్రజా సేవకుడు. ఆయన వ్యూహాత్మక దృక్పథం లేకుంటే భారత్ - అమెరికా మధ్య అపూర్వమైన సహకారం సాధ్యమయ్యేదే కాదు. చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందం నుంచి ఇండో - పసిఫిక్ భాగస్వాముల కోసం క్వాడ్‌ను ప్రారంభించడం వరకూ ఆయన కృషి మరవలేనిది' అంటూ పేర్కొన్నారు. జో బైడెన్, జిల్ బైడెన్.. మన్మోహన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది. 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మొదటి పర్యాయంలోనే దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే



నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమయ్యారు.

## మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై రాజకీయాలొద్దు : మాయావతి



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు, స్మారకంపై రాజకీయాలు చేయడాన్ని బీఎస్పీ చీఫ్ మాయావతి తీవ్రంగా ఖండించారు. మన్మోహన్ సింగ్ కుటుంబం, సిక్కు మతం యొక్క సెంటిమెంట్స్‌ను కేంద్ర సర్కారు గౌరవించాలని ఆమె హితవుపలికారు. మన్మోహన్ సింగ్ కుటుంబం ఎక్కడైతే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కోరుతున్నదో అక్కడే నిర్మించాలని సూచించారు. ఈ విషయంలో ఎవరికీ రాజకీయాలు చేసే హక్కు లేదని, కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్ కుటుంబం కోరిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని మాయ డిమాండ్ చేశారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరిగిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుండగా.. అక్కడ కుదరదని ఆయన స్మారకాన్ని ఎక్కడ నిర్మించాలనేది త్వరలో నిర్ణయిస్తామని కేంద్రం చెబుతోంది. ఈ నేపథ్యంలో మాయావతి తాజా వ్యాఖ్యలు చేశారు.

## ఆ రైతులపై సుప్రీంకోర్టు ఆగ్రహం.. దలేవాల్‌ను ఆస్పత్రిలో చేర్చాలని ఆదేశం



పంజాబ్‌లో రైతు సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ గత నెల 26 నుంచి నిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దాంతో ఆయనను ఆస్పత్రికి తరలించకుండా ఇతర రైతు నాయకులు అడ్డుకుంటున్నారు. తమ డిమాండ్ల పరిష్కారంపై హామీ ఇచ్చిన తర్వాతనే దలేవాల్‌ను ఆస్పత్రికి తరలించేందుకు అంగీకరిస్తామని పట్టుబడుతున్నారు. ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో రైతు నేత దలేవాల్‌ను వెంటనే ఆస్పత్రిలో చేరేందుకు ఒప్పించి, ఆస్పత్రికి తరలించాలని ఈ నెల 20న పంజాబ్ చీఫ్ సెక్రెటరీ, డీజీపీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అమలు చేయడంలో వారు విఫలం కావడంతో వారికి వ్యతిరేకంగా కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం ఇవాళ విచారణ చేపట్టింది. దలేవాల్‌ను ఆస్పత్రికి తరలించకుండా ఇతర రైతు నేతలు అడ్డుకుంటున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. దాంతో కోర్టు ఆ రైతు నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దలేవాల్ క్షేమం కోరేవారు ఆవిధంగా ప్రవర్తించరని వ్యాఖ్యానించింది. రైతు నేతలతో మాట్లాడి దలేవాల్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించింది.

## జోష్ నింపిన న్యూఇయర్



2024 సంవత్సరం ముగింపునకు వచ్చేసింది. 2025 సంవత్సరానికి వెల్‌కం చెప్పేందుకు అందరూ రెడీ అవుతున్నారు. అయితే, చాలా మంది వినూత్నంగా న్యూ ఇయర్‌ను సెలబ్రేట్ చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్నేహితులు, కుటుంబీకులతో కలిసి పార్టీలు జరుపుకోవడంతోపాటు విహార యాత్రలకు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలోనే హిల్ స్టేట్ హిమాచల్ ప్రదేశ్ పర్యాటకులతో కళకళలాడుతోంది. ప్రస్తుతం హిమాచల్‌లో భారీగా మంచు పడుతోంది. శుక్రవారం లాహౌల్ - స్పితి, మనాలి ఎగువ ప్రాంతాల్లో భారీగా మంచు కురిసింది. సోలాంగ్ వ్యాలీ, రోహ్‌తంగ్‌పాస్, అటల్ టన్నెల్ ప్రాంతాలు మంచుతో పర్యాటకుల ఆహ్వానిస్తున్నాయి. న్యూఇయర్‌కి తోడు మంచు అందాలు పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కొండ ప్రాంతానికి పోటెత్తుతున్నారు. సిమ్లా, మనాలి, కసోల్ తదితర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. మరోవైపు భారీగా వాహనాలు రావడంతో ట్రాఫిక్ రద్దీ నెలకొంది గత వారం రోజుల్లో 30 వేల మందికి పైగా ప్రజలు మనాలిని సందర్శించినట్లు అధికారులు తెలిపారు. దాదాపుగా 10 వేల వాహనాలు పట్టణంలోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. న్యూఇయర్ వేడుకల కోసం సుమారుగా 20 వేల మందికిపైగా పర్యాటకులు హిల్ స్టేషన్‌ను సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం మనాలి %-% సోలాంగ్ నాలా రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. సోలాంగ్ వ్యాలీలో భారీగా మంచు కురుస్తుండటంతో ముందు వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ కారణంగా సుమారు 1,000 వాహనాలు అక్కడ చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ఆయా వాహనాల్లో దాదాపు 5000 మంది పర్యాటకులు ఉన్నట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పర్యాటకులను కులు పోలీసులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం అక్కడ రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి.

## ఆ నలుగురి చేతిలో నితీష్ బందీ... తేజస్వి సంచలన వ్యాఖ్యలు



**పాట్నా:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వానికి సంబంధించి నితీష్ సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం లేదని, కొందరు సన్నిహితుల చేతిలో ఆయన 'బందీ'గా ఉన్నారని అన్నారు. నితీష్ కుమార్ మరోసారి కూటమి మారే అవకాశాలపై శనివారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో తేజస్విని మీడియా ప్రశ్నించినప్పుడు అలాంటి ఊహాగానాలకు తన వద్ద ఆధారాలేమీ లేవని, అయితే బీహార్‌ను ఆయన నడపలేకపోతున్నారనేది మాత్రం తాను చెప్పగలనని అన్నారు. "కుమార్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. సొంత పార్టీకి చెందిన నలుగురి చేతిలో ఆయన బందీగా ఉన్నారు. ఇద్దరు ఢిల్లీలో ఉండగా, ఇద్దరు ఇక్కడ ఉన్నారు" అని అన్నారు. తన వ్యాఖ్యలకు బలం చేకూర్చే సంఘటనలను ఆయన ప్రస్తావిస్తూ, బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను కించపరచేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇటీవల వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీకి మద్దతిచ్చే విషయాన్ని పునరాలోచించాలని కుమార్‌కు 'ఆప్' సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల లేఖ రాశారని, అయితే జేడీయూ నేత (వర్కిగ్ ప్రెసిడెంట్) సంజయ్ ఝా నుంచి సమాధానం వచ్చిందని అన్నారు. చాలా స్పష్టంగా సీఎం హోదాలో ఉన్న నితీష్ పేరుతో కేజ్రీవాల్ లేఖ రాస్తే సంజయ్ ఝా సమాధానం ఇవ్వడం ఏమిటని తేజస్వి ప్రశ్నించారు. దీనిని బట్టే బీహార్ రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు.

# అక్రమ నిర్మాణాలపై హైడ్రా మరింత దూకుడు

-మొదటిపేజీ తరువాయి

చదరపు కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. హైడ్రా వెనక్కి తగ్గలేదని పేర్కొన్నారు. 200 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పటివరకు కాపాడామని చెప్పారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మొదట్లో దూకుడుగా వ్యవహరించామని వివరించారు. ఇప్పుడంతా రిజునవేషన్‌పైనే దృష్టి పెడతామని చెప్పారు. హైడ్రా కూల్చివేతలు ఆగవని.. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ తర్వాతే మళ్లీ కూల్చివేతలు మొదలు పెడతామని పేర్కొన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విషయంలోనూ హైడ్రాకు ఒక ప్లాన్ ఉందని తెలిపారు. హైడ్రా దూకుడు వల్ల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పై ప్రజలకు అవగాహన ఏర్పడిందని రంగనాథ్ అన్నారు. ప్రస్తుతం ఒక ప్రాపర్టీ కొనేముందు ఎఫ్‌టీఎల్/బఫర్‌జోన్‌లో ఉందా? లేదా? అనే విషయాన్ని చూసుకుంటున్నారని తెలిపారు. త్వరలోనే హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు తమకు సంబంధం లేదని.. అయినప్పటికీ మూసీ ఆక్రమణలపై కూడా దృష్టి పెడతామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. భూ యజమానులకే కాదు.. కిరాయిదారులకు కూడా నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు. ఔటర్ పరిధిలో 1,025 చెరువులను గుర్తించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వీటన్నింటికీ %ఖీూ%, బఫర్ జోన్‌లు గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు. వివిధ డేటా, సాంకేతిక పరిజ్ఞానం, ఏరియల్ సర్వే, డ్రోన్ సర్వే డేటాను కూడా పరిగణనలోకి తీసుకుని %ఖీూ%, బఫర్ జోన్‌లు నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 5,800 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ లు ఇచ్చే కంప్లెయింట్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువుల పునరుజ్జీవనంపై దృష్టి పెట్టామని



రంగనాథ్ తెలిపారు. త్వరలోనే 12 చెరువులను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

చెట్లు పడిపోవడం, నీళ్లు నిలవడం, ఫైర్ యాక్సిడెంట్‌కు సంబంధించిన ఫిర్యాదులు కూడా ఎక్కువగానే వస్తున్నాయని రంగనాథ్ తెలిపారు. వాటిని డీఆర్‌ఎఫ్ బృందాల ద్వారా అడ్రస్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమకు త్వరలోనే 72 డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అలాగే తమకు వెదర్ రాడార్ రానుందని.. దీనికోసం సపరేట్ వింగ్ కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. హైడ్రా ఎఫ్‌ఎం ఛానల్‌ను కూడా తీసుకొస్తామని ప్రకటించారు. ఇందులో వెదర్ ఫోర్‌కాస్ట్ చేస్తామని అన్నారు. అన్ని చెరువుల ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌ల వివరాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

జూలై 19వ తేదీకి ముందు అనుమతులు తీసుకుని %ఖీూ%, బఫర్ జోన్ లో ఉన్నా.. ఆ నివాసాలను కూల్చబోమని రంగనాథ్ తెలిపారు. కమర్షియల్ బిల్డింగ్‌లపై మాత్రం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్కులు, నాళాలపై అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం హైడ్రా దగ్గరకు వచ్చి తమ ఫిర్యాదులను అందజేయవచ్చని పేర్కొన్నారు. హైడ్రా ఎవ్వరికీ %చీూజ% లు ఇవ్వదని స్పష్టం చేశారు.

మధురా నగర్‌లో తాము ఉంటున్న ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఇప్పుడు అక్కడ చెరువు లేదని.. అయినప్పటికీ తాము చెరువు కట్టకు కింద కిలోమీటర్ దూరంలో ఉన్నామని స్పష్టం చేశారు. అక్కడ లేని వాటి గురించే చర్చిస్తున్నారని.. ఇటువంటి వాటి గురించి నెగెటివ్‌గా ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు

**ఆక్రమణలపై చర్యలు..**

"27 పురపాలక సంఘాలపై కూడా మాకు అధికారం ఉంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నాం. భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై కూడా దృష్టి పెట్టాం. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తాం. 12 చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే 72 డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయి. నాగోల్‌లో ఉన్న డీఆర్‌ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తాం. త్వరలోనే నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుంది. వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నాం. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్‌ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం" అని రంగనాథ్ వెల్లడించారు.

# జనవరి 7న విచారణకు రండి

-మొదటిపేజీ తరువాయి

విచారణలో ఏసీబీ దూకుడు ప్రదర్శిస్తోంది. ఫార్ములా -ఈపై విచారణ రాజకీయ కక్షసాధింపు అనడం అర్థరహితమంటోంది ంఅః. కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వ ఖజానా దుర్వినియోగం అయిందని ఇందులో వివరించింది. ఏకపక్ష నిర్ణయం తీసుకొని చెల్లింపులు జరిగాయని కోర్టు దృష్టికి తెచ్చింది ఏసీబీ. ప్రభుత్వ అనుమతి లేకుండానే విదేశీ కంపెనీకి 54 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని ఆరోపణలతో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే..! రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుంగా ఏకపక్ష నిర్ణయం తీసుకుని చెల్లింపులు జరిగాయని కేసులో పేర్కొన్నారు. దీని వల్ల ఊఓఆంపై అదనంగా 8 కోట్ల రూపాయల భారం పడిందని కోర్టుకు తెలిపింది ఏసీబీ. రెండో సెషన్‌కి సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండానే అగ్రిమెంట్ చేసుకున్నారని ఏసీబీ ఆరోపించింది. మొదటి అగ్రిమెంట్‌లో ప్రభుత్వం కేవలం ట్రాక్ నిర్మాణంతో పాటు ఏర్పాట్లు చేసేలా ఉంది. ఇక రెండో సెషన్ అగ్రిమెంట్‌లో ఏర్పాట్లతో పాటు స్పాన్సర్ అమౌంట్ కూడా ఊఓఆం చెల్లించే విధంగా ఒప్పందం కుదిరింది. ఇది జరిగి ఉంటే ప్రభుత్వంపై మరో 600 కోట్ల రూపాయల భారం పడి ఉండేదని ంఅః వేసిన కౌంటర్ పిటిషన్‌లో వివరించింది. ఇక అంతకుముందు ఫార్ములా ఈ కార్ రేసు కేసులో కేటీఆర్



వేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిగింది. అయితే కౌంటర్ దాఖలుకు ప్రభుత్వం సమయం కోరింది. దీంతో తదుపరి విచారణను వాయిదావేసింది హైకోర్టు. అప్పటి వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దని ఆదేశాలు జారీచేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో ఏ1గా ఉన్నారు కేటీఆర్.

ఫార్ములా ఈ రేసింగ్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్, డిసెంబర్ 28: ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులోని వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఏసీబీ అందజేసింది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక శాఖ రికార్డ్స్, హెచ్‌ఎండీఏ చెల్లింపుల వివరాలు, హెచ్‌ఎండీఏ చేసుకున్న ఒప్పంద పత్రాలతో పాటు ఎఫ్‌ఐఆర్‌ను ఈడీకీ ఏసీబీ అందజేసింది. అలాగే ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో హైకోర్టులో ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కౌంటర్‌లో కీలక అంశాలను ఏసీబీ ప్రస్తావించింది. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగించడంతో పాటు నేరపూరిత దుష్ప్రవర్తనకు కేటీఆర్ పాల్పడ్డారని కౌంటర్లో ఏసీబీ పేర్కొంది. కేబినెట్ నిర్ణయం, ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే చెల్లింపులు చేయాలని అధికారులపై కేటీఆర్ ఒత్తిడి చేశారని.. అనుమతులు లేకుండా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు బదిలీ చేశారని తెలిపారు. దీని వలన హెచ్‌ఎండీఏకు రూ.8 కోట్లు అదనపు భారం పడిందని... అసంబద్ధమైన కారణాలు చూపి కేసును కొట్టివేయాలని అడగడం దర్యాప్తును అడ్డుకోవడమే అని వెల్లడించింది. కేటీఆర్ వేసిన పిటిషన్‌కు విచారణ అర్హత లేదని ఏసీబీ కౌంటర్‌లో పేర్కొంది. అధికారుల నుంచి అనుమతి పొందిన తర్వాతనే కేటీఆర్‌పైన ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఏసీబీ తెలిపింది.

రాజకీయ కక్షతోనో, అధికారులపై ఒత్తిళ్లతోనూ కేసు నమోదు చేశామనడం సరైనది కాదని వెల్లడించింది. మున్సిపల్ శాఖ ఒప్పందాలు కుదుర్చుకున్నప్పుడు బిజినెస్ రూల్స్‌ను ఉల్లంఘించారని తెలిపింది. ఎఫ్‌ఈఓకు చెల్లింపులు జరపాలని స్వయంగా కేటీఆర్ వెల్లడించినట్లు తానే చెప్పారని.. ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ ఆలస్యం అయినందున కేసు కొట్టివేయాలని కోరడం సరైంది కాదని ఏసీబీ తెలిపింది. తీవ్రమైన అభియోగాలు ఉన్నప్పుడు ప్రాథమిక విచారణ లేకుండానే కేసు నమోదు చేయవచ్చన్న సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయన్న కౌంటర్‌లో ఏసీబీ పేర్కొంది.

# నేతలకు లీగల్ సపోర్ట్

**హైదరాబాద్ :** పుష్కర కాలం ఉద్యమం. పదేళ్ల పాలన..ఇప్పుడు ఏడాది పాటు అపోజిషన్ రోల్. ఇది బీఆర్ఎస్ హిస్టరీ. కానీ ఉద్యమంలో కూడా ఫేస్ చేయనన్ని కేసులు ఎదుర్కొంటున్నారు ఆ పార్టీ నేతలు. అధికార పార్టీ మీద దూకుడు మీద పోరాడుతోన్న నేతలందరికీ వరుస చిక్కులు వచ్చి పడుతున్నాయి. దీంతో పార్టీ పరంగా లీగల్ సపోర్ట్ ఇవ్వాలని భావిస్తోంది గులాబీ అధిష్టానం. పోలీస్ కేసుల నుంచి నేతలకు రిలీఫ్ కలిగించేందుకు స్పెషల్ లీగల్ టీమ్‌తో భరోసా కల్పిస్తోంది. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గులాబీ నేతల వరకు అందరూ పోలీస్ కేసులతో సతమతం అవుతున్నారు. సోషల్ మీడియా పోస్టులు..బహిరంగ స్టేట్‌మెంట్లు ఇచ్చినా ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు గులాబీ నేతలు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద పోరాడుతోన్న తమ పార్టీ నేతలను పోలీసు కేసులతో బెదిరించే ప్రయత్నం జరుగుతోందని బీఆర్ఎస్ మండిపడుతోంది. పార్టీ కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఇప్పటికే కేసులు ఎదుర్కొంటున్నారు. లగచర్ల ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి జైలుకు వెళ్లారు. బెయిల్‌పై వచ్చిన తర్వాత ఆయన మరోసారి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంతో నరేందర్ రెడ్డిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు రెడీ అవుతున్నారట. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి గులాబీ పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో మిగిలిన రాజకీయ పార్టీల కంటే ఎంతో ముందుండే వారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా అధికార పార్టీ నేతలుగా అదే దూకుడును ప్రదర్శించారు. దాదాపు 12 ఏళ్లపాటు ఉద్యమంలో పదేళ్లు ప్రభుత్వంలో గులాబీ నేతలు హల్చల్ చేశారు. అయితే పార్టీ ఓటమితో ప్రతిపక్షంలోకి వచ్చిన ఏడాదిలోపే కీలక నేతలంతా సైలెంట్ అయిపోయారు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరించిన ఎంతోమంది యువనేతలు ప్రభుత్వంపై దూకుడుగా పోరాడేందుకు వెనకడుగు వేస్తున్న




పరిస్థితులు కనిపిస్తున్నాయి. పార్టీలో, ప్రభుత్వంలో చక్రం తిప్పిన నేతలు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ అనుభవించిన ఆ నేతలు ఇప్పుడు సైలెంట్ కావడం వెనుక కారణాలు ఏమిటన్న గుసగుసలు గులాబీ నేతల్లో వినిపిస్తున్నాయి. ఈ సమయంలో నేతలు సైలెంట్‌గా మారడంతో..గులాబీ పార్టీ కూడా రూటు మార్చింది. పార్టీ నేతలకు చట్టపరంగా ఇబ్బందులు ఎదురైనా వారికి అండగా ఉండాలన్న నిర్ణయానికి వచ్చింది. లగచర్ల ఘటనలో జైలుకెళ్లిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా రైతులకు న్యాయ సహాయం అందజేసింది పార్టీ. లీగల్ సెల్ బాధితుల పక్షాన భరోసా కల్పిస్తూ అండగా నిలబడుతుంది. అయితే పార్టీ లీగల్ సెల్‌ను మరింత పటిష్టం చేయాలని గులాబీ బాస్ ప్రత్యేక దృష్టి పెట్టారట. అవసరమైతే కీలక కేసుల్లో అత్యున్నత స్థాయి న్యాయవాదులను కూడా నియమించుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారట. ఇటీవల కేటీఆర్‌పై నమోదైన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఢిల్లీకి చెందిన న్యాయవాదిని పార్టీ ఎంగేజ్ చేసింది. కేటీఆర్‌కే కాదు పార్టీకి చెందిన ఏ నేతకు కేసుల పరంగా ఇబ్బందులు వచ్చినా లీగల్‌గా అన్ని విధాలుగా అండగా నిలవాలని భావిస్తోందట. ప్రభుత్వంపై పోరాటం చేసే క్రమంలో కేసులు నమోదైతే..లేక స్కామ్‌లు, అక్రమాలు అంటూ ఇబ్బందులు ఎదురైతే న్యాయస్థానం తలుపు తట్టడమే అస్త్రమని భావిస్తుంది గులాబీ పార్టీ. పార్టీ లీగల్ సెల్‌కు ఇప్పటికే రూ. 10కోట్లు కేటాయించారు గులాబీ బాస్. అవసరమైతే మరిన్ని నిధులు ఇచ్చేందుకు కూడా రెడీగా ఉన్నారట. అంతేకాదు ఢిల్లీ స్థాయిలో కూడా లాయర్లను హైర్ చేసుకోవాలని..న్యాయపోరాటం విషయంలో వెనక్కి తగ్గొద్దని చెప్తున్నారట. ఒకవేళ తాము బయటికి వస్తే పాత కేసులు..గతంలో చేసిన దందాల వెలుగులోకి వస్తాయని భయపడుతున్న నేతలకు లీగల్ ఫైట్‌తో భరోసా కల్పించి..పార్టీని స్ట్రాంగ్‌గా ఉంచాలని భావిస్తున్నారట కేసీఆర్. అందుకే రాబోయే నాలుగేళ్లు ఓ వైపు ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే.. కేసులు నమోదైతే న్యాయ పోరాటానికి కూడా సిద్ధంగా ఉండాలని ఫిక్స్ అయ్యారట. చూడాలి మరి గులాబీ బాస్ వ్యూహం ఎంతవరకు సక్సెస్ అవుతుందో.

## శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలు కాదు.. ఇవి ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి

ఉంటుందని గవర్నర్ జిష్ణుదేవ్ తెలిపారు. పుస్తకాలు చదువుతుంటే రచయితతో నేరుగా మాట్లాడుతున్నట్లుగా ఉంటుందన్నారు. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందేనని చెప్పారు. నిరక్షరాస్యులకు ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. నేటి యువత పుస్తకాల వైపు మళ్లేలా పెద్దలు ప్రోత్సహించాలని చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ



రాష్ట్రంలో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరపై 400 రూపాయల బోనస్ ఇచ్చి కంది రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు 6 లక్షల ఎకరాల్లో 2.5లక్షల మెట్రిక్ టన్నుల కందులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో భాగంగా కందులకు మద్దతు ధరతో పాటు అదనంగా 400 రూపాయల బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చి రైతులను నమ్మించారని అన్నారు. కానీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బహిరంగ మార్కెట్‌లో రైతులు కనీస మద్దతు ధర పొందే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కందులకు మద్దతు ధర 7,550 ఉంది కానీ బహిరంగ మార్కెట్‌లో 6500 నుంచి 6800 మించి క్వింటాలుకు చెల్లింపు జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ప్రతి క్వింటాలు పైన మద్దతు ధరతో పోలిస్తే రైతులు 800 రూపాయలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉన్నట్టు కనిపిస్తున్నదని అన్నారు. కాబట్టి వెంటనే ప్రభుత్వం కంది రైతుల పట్ల నిర్లక్ష్యం వీడి.. వారి గోస తీర్చడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. అలాగే రైతులకు మద్దతు ధర అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం మద్దతు ధరపై 400 రూపాయల బోనస్ కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పదవుల కోసం పడిగాపులు

-మొదటిపేజీ తరువాయి

నేతలందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటానని పీసీసీ చీఫ్ చెబుతున్నా..అది ఇంకా కార్యరూపం దాల్చడం లేదు. దీంతో పార్టీ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలకు కూడా నిరాశ తప్పడం లేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడం లేదు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కొలిక్కి తేవడం లేదు. దీంతో పదవుల రేసులో ఉన్న నేతలకు రోజులు భారంగా గడుస్తున్నాయట. అధికారంలో ఉన్నామని ఆనంద పడాలో..పదవి లేదని బాధపడాలో తెలియకపైకి మాత్రం హ్యాపీగానే ఉన్నట్లు కలరింగ్ ఇస్తున్నారట. లోలోపట..తమ అనుకున్న వాళ్ల దగ్గర మాత్రం ఫ్రస్ట్రేషన్‌ను వెళ్లగక్కుతున్నారట. ఏందిది ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిపోయింది.. ఇప్పటికీ మంత్రివర్గం విస్తరణ..నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయకపోతే..గ్రామాల్లోకి వెళ్తే క్యాడర్‌కు, ప్రజలకు ఏమని సమాధానం చెప్పుకోవాలంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారటఓ రకంగా కక్కలేక మింగలేక అన్నట్లుగా ఉందట కొందరు నేతల పరిస్థితి. తెల్లారి లేస్తే పార్టీ కోసం గళం విప్పుతున్నా..చెప్పుకుందామంటే ఓ హోదా లేకపాయే ఇదెక్కడి బాధరా నాయనా అని ఫీల్ అవుతున్నారట. అట్లని బయటపడకుండా కవర్ చేసుకుంటున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు కన్ఫ్యూజన్‌లో పడిపోయారట. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా..ఇంకా పదవులు దక్కకపోతే ప్రజల్లోకి ఎలా వెళ్లాలి..అపోజిషన్ బీఆర్ఎస్‌ను ధైర్యంగా ఢీకొట్టేదేలా అని ప్రశ్నిస్తున్నారట. క్యాబినెట్‌లో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నా ఫుల్ ఫిల్ చేయడం లేదు. ముందు లోక్ సభ ఎన్నికలు అన్నారు..తర్వాత దసరా అన్నారు..దీపావళి కూడా అయిపోయింది. ఇప్పుడు మూఢాలు అంటున్నారు. సంక్రాంతి తర్వాత కూడా మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందా అంటే డౌటే అంటున్నారు హస్తం పార్టీ లీడర్లు. సీఎం రేవంత్ పలుమార్లు ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలతో చర్చించినా క్యాబినెట్ విస్తరణ ఇంకా కొలిక్కి రాని అంశంగానే మిగిలిపోయిందంటున్నారు. ఉమ్మడి జిల్లాలు..సామాజిక సమీకరణాలను ఆధారంగా క్యాబినెట్ విస్తరణ చేయాలని భావించారు. కానీ ఆశావహులు ఎక్కువగా ఉండటం..క్యాస్ట్ ఈక్వేషన్స్ సెట్ కాలేదట. ఇవన్నీ ఒక ఎత్తైతే ముఖ్యనేతల మధ్య సయోధ్య కుదరకపోవడం వల్ల క్యాబినెట్ విస్తరణ ఆలస్యమవుతోందట. కీలక నేతలు ఎవరికి వారు తమ వర్గానికే పదవులు ఇవ్వాలని పట్టుపడుతుండటంతో..హస్తిన పెద్దలు కూడా చేతులు ఎత్తేశారట. రాష్ట్ర స్థాయిలో నేతలు మాట్లాడుకుని ఓ నిర్ణయానికి రావాలని ఢిల్లీ పెద్దలు సూచించినట్లు టాక్. దీంతో క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్ ఎటూ తేలని అంశంగా హోల్డ్‌లో ఉండిపోయిందంటున్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు భర్తీ చేయాలనుకున్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ముఖ్యమైన నేతల ఇగో పంచాయితీ.. తమకు పదవులు దక్కకుండా చేస్తుందని అంటున్నారట దిగువ స్థాయి నేతలు. పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పోస్ట్‌తో తమకు ప్రోటోకాల్ ఉన్న పదవి వస్తుందని ఆశలు పెట్టుకుంటే..ఏడాది అయినా ఇప్పటివరకు ఏం దిక్కులేదని దిగాలుగా ఉండిపోతున్నారట కొందరు నేతలు. అయితే మొదటి విడతలో భాగంగా 38 మందికి ఒకేసారి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశారు. మధ్యలో ప్రభుత్వ సలహాదారు, డైరీ కార్పొరేషన్ పోస్టులను కూడా భర్తీ చేశారు. ఇదంతా పూర్తయి దాదాపు ఆరు నెలలు అయిపోతోంది. ఇంకా ప్రభుత్వంలో 30కి పైగా నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా త్వరలోనే భర్తీ చేస్తామని గతంలో హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్నా..నామినేటెడ్ పోస్టుల అంశం కొలిక్కి రావడం లేదు. దీంతో అధికారం ఉన్నప్పుడు కూడా పట్టించుకోకపోతే తమ పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నారట లీడర్లు. అయితే లోకల్ బాడీ ఎన్నికల్లోపు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని చూస్తున్నారట. ఈ విషయంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా హామీ ఇస్తున్నారు. అటు ప్రభుత్వంలో ఇటు పార్టీలో పదవుల భర్తీ ఆలస్యం అవుతుండటంతో..తెలంగాణ కాంగ్రెస్ నేతలు పూర్తి నిరాశ నిస్పృహలో ఉన్నారన్న చర్చ జరుగుతోంది. అయితే లోకల్ బాడీ ఎన్నికలకు వెళ్లే ముందే..నామినేటెడ్ పోస్టుల భర్తీ..వీలైతే మంత్రివర్గ విస్తరణ చేయాలని భావిస్తున్నారట. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందడుగు వేయడం లేదన్న టాక్ వినిపిస్తోంది. చూడాలి మరి హస్తం నేతల ఆశలు ఎప్పుడు నెరవేరుతాయో.

## ఇందిరమ్మ ఇళ్ల డేటా ఎంట్రీ సమస్యకు పరిష్కారం..


**కరీంనగర్ :** అవసరం మన ఆలోచనలకు పదును పెడుతుంది. ఆవిష్కరణలవైపు అడుగులు వేయిస్తుంది. సమస్యలకు పరిష్కార మార్గం వెతుకుతుంది. ప్రపంచంలో చాలా వరకు ఇలా ఆవిష్కృతమైనవే. ఏదైనా ఆవిష్కరించాలి అంటే.. అందుకు సైంటిస్టే కానవసరం లేదు. అవసరం మన ఆలోచనలకు పదును పెడుతుంది. సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా ఆలోచింప జేస్తుంది. ఈ క్రమంలో ఆవిష్కరణలవైపు అడుగులు వేయిస్తుంది. సృష్టిలో కొన్ని సహజ సిద్ధంగా పరిష్కార మార్గాలు చూపితే.. చాలా సమస్యలకు మనిషే పరిష్కారం కనుగొన్నాడు. అందుకే ఆది మానవుల కాలం నుంచి ఆధునిక మానవుడిగా ఎదగగలిగాడు. ఇక నేటి తరం యువత సమస్యల పరిష్కారానికి అనేక మార్గాలు కనిపెడుతోంది. పిల్లలు కూడా తమ మెదడుకు పదును పెట్టి ఆవిష్కరణలు చేస్తున్నారు. చదువుకున్న జ్ఞానంతో కొత్త కొత్త ఆవిష్కరణలతో ప్రతిభ కనబరుస్తున్నారు. రెండేళ్ల క్రితం వేములవాడకు చెందిన బాలుడు ధాన్యం బస్తాల్లోకి ఎత్తే చిన్న పరికరం తయారు చేశాడు. దీంతో తన తండ్రి సమస్యకు పరిష్కారం కొనుగొన్నాడు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ పని తప్పించుకుందామని చూస్తారు. కరెంటు పోయినా, ఇంటర్నెట్ అవాంతరాలు ఏర్పడినా ఖాళీగా ఉంటారు. ప్రజలు ఇబ్బంది

## సంపాదకీయం

# ఉనికి కోసం కాంగ్రెస్ ఉరుకులాట

'ఉనికిని కాపాడుకోవాలా? పూర్వవైభవం సంపాదించడానికి దారులు వెతకాలా?'.. భారత పూర్వ పాలకపక్షం కాంగ్రెస్ పార్టీని ఇప్పుడు పీడిస్తున్న కీలక ప్రశ్నలివే. దక్షిణాదిన గుండెకాయ వంటి ప్రధాన రాష్ట్రం తెలంగాణలో పదేండ్ల విరామం తర్వాత 2023 శీతాకాలంలో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఈ జాతీయపక్షానికి 2024 వేసవి నుంచి అన్నీ ఎన్నికల ఎదురుదెబ్బలే తగిలాయి. దశాబ్దం తర్వాత లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ గుర్తింపు పొందింది. ఎట్టకేలకు రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేత అయ్యారు. గత రెండు పార్లమెంటు ఎన్నికల్లో వరుసగా 44, 52 సీట్లకే పరిమితమైన ఆ పార్టీ పదేండ్లలో జాతీయపక్షమా? ప్రాంతీయపక్షమా? అంటే చెప్పలేని స్థితికి చేరుకున్నది. పార్లమెంటు లోపల, బయటా బాధ్యత గల, శక్తిమంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించలేక చతికిలపడింది. 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో ఉన్న రాహుల్‌గాంధీ ఆ పార్టీ బలాన్ని ఆయన కనీసం పది సీట్లు కూడా పెంచలేకపోయారు. అంతేకాదు, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆరు నెలలకు పైగా ఉండి రాహుల్ గాంధీ సంపాదించి పెట్టినవన్నీ పరాజయాలే. 2023లో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం రాహుల్, కాంగ్రెస్ కలలకు ఊతమిచ్చింది. కర్ణాటక ఎన్నికల్లో మాదిరిగానే ప్రజలను మాయజేసే హామీలతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్పశాతం ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆది నుంచీ ఊహించని రీతిలో ముందుకుసాగుతున్నది. రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడంతో పాలకపక్షంగా ఆ పార్టీని కొత్త దారిలో పడేసింది. అంతేకాదు, ఈ రెండు చోట్లా పరిపాలన గాడితప్పింది. జనంలో వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతోంది. కర్ణాటకలో సిద్ధరామయ్య నానా పాట్లు పడుతుండగా, తెలంగాణలో రేవంత్‌రెడ్డి తప్పుడు నిర్ణయాలతో తాను ఇబ్బంది పడుతూ.. పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. సొంత రాజకీయ ప్రయోజనాలే తప్ప పార్టీ, ప్రజల క్షేమం ఆయనకు పట్టడం లేదు. దేశవ్యాప్తంగా ఎంపీ సీట్లు దాదాపు రెట్టింపు కావడంతో పాటు హర్యానాలోని పది సీట్లలో సగం స్థానాలు గెలుపొందడంతో రాహుల్‌గాంధీ అండ్ కోకు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు నల్లేరుపై బండిలా కనిపించింది. కానీ, కాంగ్రెస్ ఘోర పరాజయం పాలవడం పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇం డియా కూటమి పార్టీలకు అక్కడ ఒకటీ అరా సీట్లు కూడా ఇవ్వకపోవడం, ఆప్‌తో సీట్ల సర్దుబాటు లేకపోవడం హస్తం పార్టీని చావుదెబ్బతీసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ నేతల్లో కల్పించిన అత్యాశకు హర్యానా ఫలితాలు సగం తెరదింపాయి. ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి జీవితకాల గుణపాఠం నేర్పాయి. మాజీ సీఎంలు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌ల పార్టీలతో కలిసి కూటమిగా బరిలోకి దిగిన కాంగ్రెస్‌కు 12.42 శాతం ఓట్లు, కేవ లం 16 సీట్లు దక్కాయి. కాంగ్రెస్‌కు చివరి కంచుకోటగా పరిగణించే మహారాష్ట్రలో ఇంత తక్కువ సీట్లు రావడం పార్టీ అహంకారానికి గొప్ప ముగింపు. రాజకీయ వ్యాఖ్యాత శేఖర్ గుప్తా విశ్లేషించినట్టు కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం తన ఉనికిని కాపాడుకోవడానికి, పూర్వ వైభవం సంపాదించడానికి మధ్య ఊహల్లో కొట్టుమిట్టాడుతోంది. ఓ వైపు మహారాష్ట్రలో ఘోర పరాజయం, మరోవై పు వయనాడ్ ఉప ఎన్నికలో ప్రియాంక గెలుపు కాంగ్రెస్‌కు ఊరటో, కొత్త మలుపునకు సంకేత మో అర్థం కాని పరిస్థితి. పార్లమెంట్‌కు తొలిసారి ఎన్నికయ్యాక అన్న రాహుల్ వెన్నంటి ఉండటమే ప్రియాంక రాజకీయ కార్యకలాపంగా మారింది. ఈ సంక్షోభ సమయంలో బెళగావిలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం పార్టీకి చూపించే దారిపై కూడా ఎవరికీ పెద్దగా ఆశలు లేవు. మొత్తం మీద లోక్‌సభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్షనేత పదవి దక్కిన 2024 సంవత్సరం ఆ పార్టీకి తీవ్ర ఆశాభంగాన్నే మిగిల్చింది. కర్ణాటక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన చూస్తే కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం సరికదా, కనీసం ఉనికిని కాపాడుకోవడం కూడా చాలా కష్టమనిపిస్తున్నది. అందుకే, కాంగ్రెస్ నాయకత్వం వద్దు మొర్రో అని ఇండియా కూట మి భాగస్వామ్యపక్షాలు గత కొన్ని వారాలుగా బాహాటంగా చెప్తున్నాయి. పరాజయానికి సంకేతంగా మారిన రాహుల్‌గాంధీ స్థానంలో పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురా లు మమతా బెనర్జీని తీసుకొస్తేనే ఇండియా కూటమికి మేలనే అభిప్రాయం బలపడుతున్నది. చివరికి కాంగ్రెస్‌కు 140 ఏండ్లు నిండే 2025 సంవత్సరమే దాని భవితవ్యాన్ని తేల్చివేసే పరీక్షా సమయం.

# సినీసరస్వతీ ప్రియపుత్రుడు



పింగళి నాగేంద్రరావు... తెలుగు సినిమా రంగంతో విడదీయరాని బంధం, సంబంధం అనుబంధం ఉన్న గొప్ప రచయిత. తెలుగు సినిమా రచయిత మాత్రమే కాదు. పాత్రికేయుడు, నాటక రచయిత కూడా. కృష్ణా పత్రిక, శారద పత్రికల్లో ఆయన ఉపసంపాదకుడుగా పనిచేసాడు. వింధ్య రాణి, నా రాజు, జేబున్నీసా, మేవాడు రాజ్య పతనం, క్షాత్ర హిందు, నా కుటుంబం, గమ్మత్తు చావు తదితర నాటకాలు ఆయన రాసినవే. అయన ఒక రచయితగా తెలుగు సినీ రంగానికి చేసిన సేవ మరిచిపోలేనిది. సినిమా సంభాషణలలో కొత్త హాస్య పదాలు సినిమాలలో కొత్త పాత్రలు సృష్టించి మరెన్నో ప్రయోగాలు చేసి సినీ సాహిత్య స్వరూపాన్ని మార్చివేసిన సినీ సరస్వతీ పుత్రుడు. జానపదమైనా, పౌరాణికమైనా, సాంఘికమైనా జానపదులు సైతం మెచ్చే సరళభాషను ఉపయోగించిన సినీ ఆదికవి. "సాహసం శాయరా డింభకా", "చూపులు కలిసిన శుభవేళ", "లాహిరి లాహిరి లాహిరిలో", "అహ నా పెళ్ళంట" వంటి సినిమాల పేర్లు పింగళి పాటల్లోనుంచి తీసుకున్నవే. 1939లో తీసిన గుణ సుందరి సినిమాలో పింగళి రాసిన 'శ్రీతులసి ప్రియతులసి జయమునీయవే' పాట నేటికీ మంగళ హారతి గా పాడుకోవడం వింటూనే ఉన్నాం. పింగళి నాగేంద్రరావు 29 డిసెంబరు 1901న శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణంలో జన్మించాడు. నాగేంద్రరావు తండ్రి గోపాలకృష్ణయ్య, తల్లి మహాలక్ష్మమ్మ. పింగళి బాల్యం, విద్యాభ్యాసం మచిలీపట్నంలోనే జరిగింది. పింగళి చిన్నతనంలోనే సాహిత్యంతోబాటు వృత్తి విద్యలను కూడా అధ్యయనం చేశారు. పింగళి లోని సాహిత్య పిపాసను గమనించిన భోగరాజు పట్టాభి సీతారామయ్య, మట్నూరి కృష్ణారావు పింగళిని ప్రోత్సహించారు. 1917లో పింగళి మెకానికల్ ఇంజనీరింగ్ లో డిప్లొమా తీసుకున్నాడు. తరవాత మచిలీపట్నంలోనే కొంతకాలం ఉపాధ్యాయునిగా పనిచేశాడు. 1918లో ఖరగ్పూర్ రైల్వే వర్క్ షాపులో అప్రంటీసుగా చేరాడు. ప్రముఖ యోగా గురువు బులుసు రామజోగారావు ఉపన్యాసాలకు ప్రభావితుడై 1920లో రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పింగళి జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. ఆయన దివ్యజ్ఞాన సమాజం (థియోసాఫికల్ సొసైటీ) సభ్యుడిగా నమోదై ఉత్తర భారత దేశ మంతా పర్యటించి సబర్మతీ ఆశ్రమంలోచేరి బ్రహ్మచర్యం పాటించాలని నిర్ణయించుకుని జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోయాడు. కొంతకాలం కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించాడు. అప్పుడే 'జన్మభూమి' అనే దేశభక్తి పద్యకావ్యాన్ని రచించారు. ఫలితంగా బ్రిటీష్ ప్రభుత్వాధికారులకు ఆగ్రహానికి గురై, పింగళి జైలు పాలు కావాల్సి వచ్చింది. విడుదలయ్యాక పట్టాభి సీతారామయ్య సలహా మేరకు 1923లో 'శారద' అనే పత్రికకు సహసంపాదకుడుగా చేరి తన సాహిత్య రచనా వ్యాసంగం మీద దృష్టి సారించాడు. అదే సమయంలో బెంగాలి నాటకకర్త డి.ఎల్.రాయ్ రచించిన 'మేవార్ పతన్', 'పాషాణి' నాటకాలను తెలుగులోకి అనువదించాడు. అనువాద నాటకాలు కృష్ణాపత్రికలో ధారావాహికలుగా వెలువడ్డాయి. అదే స్ఫూర్తితో 'జేబున్నీసా', 'వింధ్యరాణి', 'నారాజు', 'క్షాత్రహిందూ', 'ఒకే కుటుంబం' వంటి నాటకాలను రాసి నాటక రచయితగా మంచి పేరు సంపాదించాడు. వాటిలో 'ఒకే కుటుంబం' నాటక రచనకు 1939లో నవ్యసాహితి సమితి సంస్థ ఉత్తమ నాటక రచనా బహుమతిని ప్రదానం చేసింది. విజయా సంస్థకు ఇరవై సంవత్సరాల సుదీర్ఘకాలం ఆస్థాన కవిగా భాసిల్లిన సాహిత్య వేత్త పింగళి. 1955 లో మిస్సమ్మలో లీల పాడిన రావోయి చందమామ మా వింత గాథ వినుమా, ఏమిటో ఈ మాయ ఓ చల్లని రాజా వెన్నెల రాజా అనే పాటలు ఇప్పటికీ బహుళ వ్యాప్తంగా ఉన్నాయి. మిస్సమ్మ పాత్రకోసం పింగళి ఆత్మాభిమానం, పెంకితనం, తలబిరుసుతనంతో కూడిన సంభాషణలు రచించాడు. పాండవుల వేషాలకు తగిన వారు దొరక లేదని, పాండవుల ప్రస్తావన అడుగడునా వస్తూనేవున్నా వారు తెరమీద కనపడకుండా పింగళి చిత్రకథను రూపొందించి హిట్ చేసిన పౌరాణిక సినిమా 'మాయాబజార్'. భారతీయ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా సి ఎన్ ఎన్, ఐ బి ఎన్ సంస్థ వంద ఆల్ టైం గ్రేట్ భారతీయ సినిమాల గుర్తింపుకోసం సర్వే నిర్వహిస్తే, మాయాబజార్ సినిమా ప్రథమ స్థానంలో నిలిచింది. ఘటోత్కచ రాక్షస గణం లోని గురువు పేరును చినమయ అని నామకరణం చేశాడు. పింగళి... "మాయ" తెలుగు పదానికి 'బజార్' అనే ఉర్దూ పదం చేర్చి పౌరాణిక చిత్రానికి మకుటంగా పెట్టడం, ఎక్కడా 'బజార్' అనే పదాన్ని చిత్రంలో రానీయకుండా జాగ్రత్తపడడం పింగళి రచనా సామర్థ్యానికి ఉదాహరణ. ఈ సినిమా అద్భుత విజయాలను నమోదు చేసిన విషయం అవగతమే. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో యేకకాలంలో నిర్మించిన సంగతి కూడా తెలిసిందే. ఈ సినిమాలో సత్యపీఠం, ప్రియదర్శిని, తస్మదీయులు, దుష్టచతుష్టయము, జియ్యా, వీరతాళ్ళు, రత్నగింబళి, గిల్పం, శాకంబరీ దేవి ప్రసాదం వంటి కొత్త పదాలను పింగళి ప్రవేశపెట్టాడు. 'ఎవరూ కనిపెట్టకుండా మాటలెలా పుడతాయి' అంటుండే వారు. 'రసపట్టులో తర్కం కూడదు', 'భలే మామా భలే', 'ఇదే మన తక్షణ కర్తవ్యము' వంటి మాటల్ని కూడా ప్రయోగాత్మకంగా వాడగా, నేటికీ అవి వాడుకలో వుండటం విశేషం.. 1958లో పింగళి నాగేంద్రరావు జయంతి సంస్థ కె.వి.రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'పెళ్లినాటి ప్రమాణాలు' చిత్రానికి, 1960 లో సారణీ వారి 'మహాకవి కాళిదాసు' సినిమాకి కథ, మాటలు, పాటలు సమకూర్చారు. 1959లో విజయావారి 'అప్పుచేసి పప్పుకూడు' సాంఘిక కామెడీ చిత్రానికి పాటలు మాత్రం రాశారు. 'మహాకవి కాళిదాసు' చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా రజత పతాకాన్ని పొందింది. తమిళంలోని 'జగదల్ ప్రతాపన్' చిత్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని విజయా సంస్థ 1961లో 'జగదేకవీరుని కథ' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రంలో పౌరాణిక అంశాలను మేళవిస్తూ పింగళి ఈ చిత్రానికి నవరస భరితంగా రచన చేశారు.. 1962లోనే బి.ఎస్. రంగా నిర్మించిన 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రానికి కథ, మాటలు పాటలు పింగళి సమకూర్చారు. ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో రాష్ట్రపతి రజత పతకం దక్కింది. గుమ్మడి చలనచిత్ర జీవితంలో ఈ చిత్రం ఒక కలికి తురాయి. 1963లో కె.వి.రెడ్డి జయంతి పిక్చర్స్ బ్యానర్ మీద 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు పింగళి సమకూర్చాడు. అర్జునుడు వేసే వేషానికి సరదాగా 'అజిభీదఫపా స్వాములు' అని అర్జునుని వివిధ నామాలను గుర్తుచేస్తూ పేరు పెట్టాడు పింగళి. 'సి.ఐ.డి' (1965), రాజకోట రహస్యం' (1971) చిత్రానికి, 'శ్రీకృష్ణసత్య' (1971) చిత్రానికి పింగళి మాటలు, పాటలు సమకూర్చారు. ఎన్ టి ఆర్ 1977లో నిర్మించిన 'చాణక్య చంద్రగుప్త' సినిమాకు చివరి సారిగా పింగళి కథ, మాటలు సమకూర్చాడు. పింగళి నాగేంద్రరావు 1971 మే 6న కన్నుమూశాడు.

# మానవాళిని కుదిపేయనున్న పెనుసవాళ్లు



ప్రపంచ జనాభా 2024కు వీడ్కోలు పలుకుతూ రానున్న 2025లోకి కోటి ఆశలతో ప్రవేశిస్తూ నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలుపడానికి ఎదురు చూస్తున్నది. ఐక్యరాజ్యసమితి 80వ వ్యవస్థాపక సంవత్సరం–2025లోకి అడుగిడుతున్న సంధికాలంలో ఉన్న ప్రపంచ మానవాళిని పలు ప్రమాదకర విపత్తులు, సంక్షోభాలు వేధించనున్నాయని ఊహించడమే అతి కష్టంగా కనిపిస్తున్నది. 2025 ఏడాదిలో కోప్–30 సదస్సుకు బ్రెజిల్ ముస్తాబు అవుతున్నది. మరో వైపు ఉక్రెయిన్– రష్యా, ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధాలతో పాటు సిరియా, సుడాన్ సంక్షోభాలు ప్రపంచ జనాభాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ 2025లోనైనా కాల్పుల విరమణలతో చక్కటి పరిష్కారాలు దొరకాలని ఆశ పడుతున్నది. సుస్థిరాభివృద్ధికి అవసర పెట్టుబడులు, వాతావరణ ప్రతికూల మార్పుల సాధికారత చర్చల వేదికగా కోప్–30 సదస్సు ఏర్పాట్లు, లింగ సమానత్వ సమస్యలను చర్చించే 4వ ప్రపంచ మహిళా సదస్సుకు 2025 నాటికి మూడు దశాబ్దాలు పూర్తి కావడం, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ఐరాసకు 80 ఏండ్లు పూర్తి కావడం 2025 ఏడాది ప్రత్యేకతగా పేర్కొన వచ్చును. అత్యంత ప్రమాదకర మానవ హక్కుల హననాలను పరిచయం చేస్తున్న యుద్ధాలతో గాజాపై ఇజ్రాయిల్ మూకుమ్మడి దాడి, ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకు పడడంతో పాటు సూడాన్, సిరియా లాంటి దేశాల్లో హృదయవిదారక దుస్థితులు నెలకొని ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో 6.2 మిలియన్లు, గాజా దాడుల్లో 1.4 మిలియన్ల మహిళలు/పిల్లలు/వృద్ధులు శరణార్థులుగా మారడం చూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 110 మిలియన్ల బలవంతపు మానవ వలసలు జరిగాయి. శరణార్థుల్లో 50 శాతం వరకు ఉక్రెయిన్, సిరియా, అఫ్ఘానిస్థాన్ అభాగ్యుల ఉన్నట్లు తేలింది. ఈ ప్రాంతాల్లో మానవాళి, ముఖ్యంగా పిల్లలు, మహిళలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని కొన ఊపిరితో బతుకులు ఈడుస్తున్నారు. ఈ సంక్షోభాలతో ప్రపంచ జనాభా గత కొన్ని ఏండ్లు/మాసాలుగా ప్రభావితం కావడం, చమురు/ఆహార ధాన్యాలు/వంట నూనెల ధరలు చుక్కల్లోకి చేరడం గమనిస్తున్నాం. కనీసం 2025లోనైనా ఈ యుద్ధాలు, సంక్షోభాలకు సమాధానాలు దొరికి, ప్రభావిత జనాభా తిరిగి పూర్వపు స్థితికి చేరాలని కోరుకుంటున్నాం. సిరియాలో ఇటీవల అరాచక పాలన అంతం కావడంతో సత్వరమే ఆ దేశంలో న్యాయం, పునర్నిర్మాణం, వ్యక్తిగత స్వేచ్ఛ, సమాన అవకాశాల కల్పన జరగాలని ఎదురు చూస్తున్నాం. 2024లో హైతీ, మయన్మార్, యెమన్‌లలో ఏర్పడిన అస్థిరత్వానికి అంతర్జాతీయ చొరవతో పాటు 2025 చక్కటి పరిష్కారాలు చూపాలి. వాతావరణ ప్రతికూల మార్పుల కట్టడికి సంబంధించిన కోప్–30 సదస్సును 2025లో బ్రెజిల్, బెలెమ్‌లో నిర్వహించనున్న వేళ ప్రపంచ మానవాళి వేయి కళ్లతో ఎదురు చూస్తున్నది. కార్బన్ ఉద్గారాల కట్టడి, హరిత గృహ వాయువులను తగ్గించడం, భూతాపాన్ని పరిమితుల్లో అదుపు చేయడం, పర్యావరణ హిత వ్యవసాయ పద్దతులను అనుసరించడం, ప్యారిస్ ఒప్పందం ప్రకారం భూతాపాన్ని 1.5 డిగ్రీల లోపు కట్టడి చేయడం, అత్యధిక కార్బన్ ఉద్గారకాలకు కారణమైన దేశాలపై అదుపు బాధ్యతలను పెంచడం, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గిస్తూ విద్యుత్ వాహనాలను ఉపయోగానికి ప్రాధాన్యం ఇవ్వడం లాంటి అంశాల అమలుకు 2025 వేదిక కావాలి. కలుషిత నీటితో 2.1 బిలియన్ల పేదలు బతుకులు ఈడుస్తున్నట్లు తేలింది. పురుషులతో సమానంగా మహిళలు, బాలికలకు ఉచిత నిర్బంధ విద్య, మాతాశిశు బాలికల ఆరోగ్య సంరక్షణ చర్యలు, మహిళలు/బాలికల కదలికలకు సమాన స్వేచ్ఛ ఇవ్వడం, బాలికలను కార్మికులుగా మార్చడాన్ని నిరోధించడం, బాలికలు/మహిళల అక్రమ రవాణాతో పాటు వేశ్య వృత్తిలోకి నెట్టడం, ఉద్యోగ ఉపాధుల్లో లింగ సమానత్వ వేతనాలు చెల్లించడం, మహిళలకు నిర్ణయాధికారాలు ఇవ్వడం, వంటింటి కుందేలును బయటకు రప్పించడం, మహిళా లోకానికి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం లాంటి ప్రధాన అంశాల్లో చొరవ చూపడానికి 2025 వేదిక కావాలి. రెండవ ప్రపంచ యుద్ధం నేర్పిన గుణపాఠాల నేపథ్యంలో 1945లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేయడం చూసాం. నాటి నుంచి నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా అనేక వాంఛనీయ, అవాంఛనీయ మార్పులు చోటు చేసుకున్నాయి. నేటి ప్రపంచ మానవాళి అవసరాలకు అనుగుణంగా ఐరాస తన పంథాను మార్చుకొని ప్రపంచ శాంతికి బాటలు వేయడానికి 2025లో నాంది పలకాలి. ఇప్పటి వరకు ఐరాస పాత్ర చాలా పరిమితంగానే ఉందని, రానున్న రోజుల్లో అయినా సకారాత్మక మార్పుల దిశగా తన పాత్రను నిర్వహించాల్సి ఉంది. నేడు జరుగుతున్న రెండు భీకర యుద్ధాలను అదుపు చేయడం, పలు దేశాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన కట్టడి చేయడం లాంటివని తక్షణావసరాలుగా ఐరాస భావించి ముందడుగులు వేయాలి.

మనిషి స్థానాన్ని రోబోలు ఆక్రమించనున్నాయి. సాంప్రదాయ జీవనశైలి, వర్తక వ్యాపారాలను రానున్న రోజుల్లో కృత్రిమ మేధ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎంతో ప్రభావితం చేయనున్నది. పనిలో వేగం పెరగడానికి ఏఐ సాంకేతికలను సన్మార్గంలో వినియోగించాల్సి ఉన్నది. నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో శాస్త్ర సాంకేతిక ఆయుధాలను దుర్వినియోగం చేస్తే మానవాళికి ఎంతో నష్టం వాటిల్లనున్నది. నేటి యుగంలో ఏఐ అనువర్తనాలు లేని రంగం లేదు. పొద్దున లేవగానే పళ్లు తోసుకోవడం నుంచి హుమనాయిడ్ రోబోటిక్స్‌తో ఇంటి పనులు చేయించే వరకు ఏఐ తన పనితనాన్ని చూపుతున్నది. మనిషి చేస్తున్న ప్రతి పనిని ఏఐ చేయడానికి సిద్ధం అయ్యింది. అమెజాన్ కంపెనీ ఇప్పటికే 7.5 లక్షల రోబోలనా వివిధ పనులకు పురికొల్పడం జరిగిందనే విషయం తెలుసుకోవాలి. కొరియా ప్రాంతం వేడెక్కడం, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడం, దక్షణ చైనా సముద్రంలో పరిణామాలు, మిడిల్ ఈస్ట్‌లో చెలరేగుతున్న సంక్షోభాలలతో పాటు గత కొన్నేళ్లుగా మానవాళినా వెంటాడుతున్న పేదరికం, ఆకలి చావులు, ప్రజారోగ్య పరిరక్షణ, నీటి కాలుష్యం, నగరాల్లో గాలి కాలుష్యం, నేల ఎడారీకరణ, మానవ హక్కుల హననాలు, జీవ వైవిధ్య విధ్వంసాలు, అణ్వాయుధాల ప్రయోగాలు, దివ్యాంగుల సమస్యలు, ఆర్థిక అసమానతలు, అవిద్య, నిరుద్యోగం, హింస, విపత్తుల దాడి, మానవ వలసలు, బాలల హక్కులు, అవినీతి చెదలు, ఇస్లామిక్ తీవ్రవాదం లేదా ఉగ్రవాదం, వేర్పాటువాదం, సైబర్ నేరాల విష వలయాలు, అంటువ్యాధుల దాడి, కోవిడ్–19 లాంటి మహమ్మారుల ఆగమనాలు లాంటివి 2025లో తమ తీవ్ర ప్రతాపాన్ని చూపకముందే విశ్వ మానవాళి మేల్కొని, తమ కర్తవ్యాలను తెలుసుకొని, తమ సుస్థిర భవితను తామే రచించుకోవాలి. 2025 ఏడాదిని రానున్న చరిత్రలో గుర్తుంచుకునే విధంగా ప్రతి ఒక్కరి సాధికారత దిశగా పటిష్ట అడుగులు పడాలి. ఊహించిన సమస్యలతో పాటు ఊహించని విపత్తులు ఎప్పుడైనా, ఎక్కడైనా రావచ్చని, అప్రమత్తతతో ఉంటూ మానవ శ్రేయస్సుకు పునాదులు వేయాలి. గుడ్ బై ఓల్డ్ ఇయర్ 2024 బీ వెల్కమ్ టు న్యూ ఇయర్ 2025.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను అందిస్తున్నామని, కాబట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసేలా చూడాలని చెప్పారు. పీహెచ్సిలలో ప్రసవాల సంఖ్య పెరిగాక పోవడానికి గల కారణాలు ఏంటని ఆరా తీశారు. వచ్చే నెల



నుంచి పీహెచ్సీలలో ప్రసవాల సంఖ్య పదికి తగ్గొద్దని చెప్పారు.

జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆర్ఎంపీలు అందరితో సమావేశం నిర్వహించాలని, వారు ఇవ్వాల్సిన సేవలు ఏంటి, వారు ఏ రకమైన సేవలు అందిస్తున్నారు అనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఆర్ఎంపీల వద్ద ప్రెగ్నెన్సీ కేసులు ఎన్ని నమోదు అవుతున్నాయి అనే విషయాలను తెప్పించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని డిఎంహెచ్వోకు సూచించారు. అదేవిధంగా జనవరి లోపు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఓ శ్రీనివాసులు, సాయినాథ్ రెడ్డి, పి వోలు ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

### సర్వే ల్యాండ్ రికార్డ్ జిల్లా అధ్యక్షులుగా ఆశయ్య... కార్యదర్శిగా భాస్కర్.

**అగ్నిధారన్యూస్ వనపర్తి జిల్లా :** సర్వే ల్యాండ్ రికార్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్జీవోస్ యూనియన్ వనపర్తి జిల్లా సెక్రటరీ.రాజు,సర్వే శాఖ జోగులాంబ జోన్ ఎలక్షన్ ఆఫీసర్.రాఘవేందర్ లు అన్నారు.శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ సర్వే ల్యాండ్ రికార్డ్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు.ముఖ్యఅతిథిగా టీఎన్జీవోస్ యూనియన్ వనపర్తి జిల్లా సెక్రటరీ.రాజు, సర్వే శాఖ జోగులాంబ జోన్ ఎలక్షన్ ఆఫీసర్ రాఘవేందర్ లు హాజరైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగులు ప్రతి ఒక్కరు టీఎన్జీవోస్ పిలుపులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,



సంఘ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు.సర్వే ల్యాండ్ రికార్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ జిల్లా నూతన కార్యవర్గం తెలంగాణ సర్వే ల్యాండ్ రికార్డ్స్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ స్పెషల్ యూనిట్ జిల్లా అధ్యక్షులుగా ఆశయ్య,కార్యదర్శిగా జి.భాస్కర్,కోశా ధికారిగా.నవీన్,అసోసియేట్ఉ పాధ్యక్షులుగా.అంజనేయులు,సహాయక అధ్యక్షులు.వెంకటలక్ష్మి, చరణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ.ఆనంద్ కుమార్,జాయింట్ కార్యదర్శిగా.సత్యనా రాయణ, జి.వికాస్,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా వసంత, వీణ రాణి, ప్రచార కార్యదర్శిగా.మన్యం కొండ,కార్యవర్గ సభ్యులు గా.స్వాతి, బి.శివయ్య,ఎండి.సలీం పాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మందమర్రి క్రికెట్ లీగ్ విజేత సజ్జు టీమ్



**అగ్ని ధార న్యూస్. మందమర్రి డిసెంబర్ 28.:** మందమరి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ వేదికగా నిర్వహించిన మందమర్రి ప్రీమియర్ లీగ్ శనివారం రోజున ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. ఫైనల్లో సజ్జు లెవెన్ వర్సెస్ తేజ 11 జట్లు తలపడగా.. 14 ఓవర్ల మ్యాచ్లో తేజా టీం మొదటగా బ్యాటింగ్ చేసి 99 పరుగులు చేయగా ,100 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సజ్జు టీం,13.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేదించింది. ఈ మ్యాచ్ లొ సుజు టీం క్రీడాకారుడు పచ్చమట్ల శ్రీకాంత్ 50 పరుగులు సాధించి జట్టును విజేతగా నిలిపాడు. ఈ యొక్క టోర్నీకి పిండి సాగర్ ఉత్తమ క్రీడాకారుడిగా నిలిచాడు. సింగరేణి మైదానంలో నిర్వహించిన ఈ యొక్క క్రికెట్ టోర్నీకి మందమరి సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యి ప్రథమ , ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ... యువత చెడు మార్గంలో ప్రయాణించకుండా చెడు అలవాట్లకు , మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలని అన్నారు. అంతేకాకుండా క్రీడలు దేహ దారుఢ్యానికి ఎంతో కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఇరుజట్లకు అభినందనలు తెలిపారు. ఈ విజేత కార్యక్రమంలో ఇరుజట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఐటీ శాఖ మంత్రితో మర్యాద పూర్వకంగా భేటీ





### తెలంగాణ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి) :** 1ఎం 1బి-8వ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ లో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించియునైటెడ్ నేషన్స్ న్యూయార్క్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగారాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ఐటిఈ సి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయిన.టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ భేటీలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగాకల్వకుర్తి పట్టణంలో తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ ఆధ్వర్యంలోఏర్పాటు చేయబోతున్న స్కిల్ సెంటర్ కు సంబంధించిన అంశాలతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన తదితర అంశాల గురించి చర్చించడం జరిగింది.

# గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి



### రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా ,అమలుకు సాధ్యం కానీ అనేక హామీలతో ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ప్రజానీకాన్ని, ఉద్యోగస్తులను మోసం చేసిందని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక ఉపాధి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల నిరసన సమ్మెకు మద్దతు తెలిపి, గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్ చేస్తున్న 18,500/- కనీస వేతనము ఇస్తూ పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిబ్బంది ప్రతి ఒక్కరికి 5,00,000/- రూపాయల వైద్య భీమా కల్పించాలని, ప్రతినెల సరైన సమయంలో జీతాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ లోపించిందని, ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందితో చర్చలు జరిపి వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించి గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ,బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మంగళ్ పల్లి నరసింహ, బీఆర్ఎస్ యూత్ వింగ్ పట్టణ అధ్యక్షుడు కొ ప్పు కృష్ణ, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు, మాజీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు క్యామ వెంకటేష్, రాయికంటి సురేష్, సిద్ధి గారి సురేష్ పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత అందజేత

### ఉప్పల ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంగాయిపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పూర్తి ఇండ్ల నిర్మాణంలో భాగంగా నిరుపేద కుటుంబానికి చెందిన అంతరం చెన్నయ్య ఇంటి స్లాబ్ కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ నుండి పబ్బ సంపత్ కుమార్ ద్వారా స్టీల్ సిమెంట్ ఇప్పించి ఈరోజు స్లాబ్ వేయించడం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన అంతరం చెన్నయ్య కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారుఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు తిరుపతయ్య, సంపత్ కుమార్, చెన్నయ్య,ఉప్పల వెంకటేష్ మిత్ర మండలి బృందం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విలీనంపై భగ్గుమన్న బలిజపల్లి గ్రామస్తులు



### ప్రజల అభీష్టం మేరకు నివేదిక పంపుతాము

### డివిజనల్ పంచాయతీ అధికారి పల్లా రఘునాథ్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** పెద్ద మందడి మండల పరిధిలోని బలిజపల్లి గ్రామపంచాయతీ విలీన వదంతులపై గ్రామస్తులు భగ్గుమన్నారు. గత నాలుగైదు రోజులుగా బలిజపల్లి గ్రామపంచాయతీని జంగమయ్యపల్లి గ్రామపంచాయతీలో విలీనం చేస్తున్నారనే వదంతులతో గ్రామస్తులు ఒక్కటై నిరసన దీక్షలకు పూనుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శనివారం బలిజపల్లి గ్రామపంచాయతీలో డిపిఓ, ఎంపీడీవో, మండల ప్రత్యేక అధికారిల నేతృత్వంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామసభ ఏర్పాటు చేయడంతో ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉండే బలిజపల్లి గ్రామస్తులంతా తమ గ్రామ పంచాయతీని కాపాడుకునేందుకు ఒకరోజు ముందే గ్రామానికి చేరుకొని మూకుమ్మడిగా గ్రామ సభకు హాజరై అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయితీ విలీనం కాకుండా చేతులెత్తి మద్దతు పలికారు. ప్రజల అభీష్టం మేరకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని అక్కడికి వచ్చిన అధికారులు తేల్చి చెప్పడంతో విలీన ప్రక్రియ ఇక నిలిచిపోయినట్టేనని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ రఘునాథ్ రెడ్డి.ఎంపీడీవో సద్గుణ. ఎంపీ ఓ పంచాయతీ కార్యదర్శి మాజీ సర్పంచ్ జయంతి. గిరిజ.అశ్వద్ధామ రెడ్డి. శశి వర్ధన్ రెడ్డి. సతశిలా రెడ్డి. సంజీవరెడ్డి. మరియు వార్డు సభ్యులు. మహిళలు. యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు పోలీస్ బంధువస్తుగా కొత్తకోట సిఐ రాంబాబు. పెద్దమందడి ఎస్ఐ యుగంధర్ రెడ్డి. రేవెల్లి ఎస్సై రాము. మరియు ఖిల్లా ఘనపూర్ఎస్సై తో పాటు పోలీస్ బందోబస్తు స్పెషల్ టీం తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కోకో సెలెక్షన్




### పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం.

**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి మహిళల కోకో సెలెక్షన్ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు సూచనలు, కోకో క్రీడలో ఎలా రాణించాలో ఆటలోని మెళకువలను క్రీడాకారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూర్యలత కాటన్ మిల్ కార్మిక నాయకులు సూర్య ప్రకాష్, వైస్ చైర్మన్ షాహెద్, నాయకులు సూరి, నిర్వహకులు జె ఎ విలియం, రాజు, పురం చందర్, మోహన్ లాల్, క్రీడాకారులు, తల్లిదండ్రులు ,తదితరులు పాల్గొన్నారు

# ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

### సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** మహేశ్వరా మహా పిరమిడ్ ధ్యాన వేడుకలలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ప్రవాస భారతీయుడు డాక్టర్ రాకేష్ రెడ్డి లట్టుపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చని అన్నారు. అదేవిధంగా అమెరికాలో స్థిరపడిన డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, వైద్యంతో నయంకాని మానసిక రుగ్మతలు ధ్యానం వలన పరిష్కరింపబడతాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి మహేశ్వర మహా పిరమిడ్ కి విచ్చేసిన ధ్యాన ప్రియులకు వసతుల ఏర్పాటులో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మరియు ట్రస్ట్ సభ్యులు చూపుతున్న చొరవ వెలకట్టలేనిదని అన్నారు.పత్రీజీ కారణజన్ముడని, శాఖాహార జగత్ కొరకు వారు తలపెట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, విశ్రాంత ఉద్యోగి మధుసూదన్ రెడ్డి,రామకృష్ణ,నరసింహ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేం నరేందర్ రెడ్డిని సన్మానించిన గుజ్జులా మహేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** హైదారాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ని వారి నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి శాలువతో సన్మానించిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృత దేహానికి నివాళులు



### కేంద్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు చల్ల వంశీ చందర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** డిల్లీ లో ,సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకొని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

# మాజీ ఎంపీ మంద జగన్నాథంకు నిమ్స్ లో పరామర్శ



### ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథం ని పరామర్శించిన ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి హాస్పిటల్లో డాక్టర్లను ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకొనీ మెరుగైన వైద్యం అందించాలని,వారిని కోరారు.

# ఆన్లైన్ గేమ్ లు ఆడి మోసపోకండి

**అగ్నిధార న్యూస్,( రామగుండం)** ఆన్లైన్ గేమ్ లు ఆడి మోసపోకండనీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ , డిఎస్పీ యం.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేది: 24-12-2024 రోజున, పెద్దపల్లి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి 1,36,96,290 రూపాయలు మోసపోయినను అని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ కి రాగా డిజి,,షికా గోయల్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ గఆదేశాల మేరకు వెంటనే కేసు నమోదు చేసి పరిశోదన ప్రారంబించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడుని మంచిర్యాల బస్టాండ్ నందు పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితున్ని విచారించగా మహమ్మద్ అబ్దుల్ నయీం, 30, వయస్సు సంవత్సరాలు, ఎక్సైజు కానిస్టేబుల్ ఇందిరా నగర్, మస్జిద్ కార్నర్, రామగుండం, పెద్దపల్లి జిల్లా, డబ్బులు ఇన్వెస్ట్ చేస్తున్న అని చెప్పి తనకు ఎక్కువ మొత్తం లో ప్రాఫిట్ వస్తాయని నమ్మించి తరచూ డబ్బులు వేయించుకొని వాటిని అతని అవసరాల కోసం వాడుకొన్నాడనీ తేలిందని తెలిపారు. అంతే కాకుండా షేర్ మార్కెట్ లో కూడా డబ్బులు ఇన్వెస్ట్మెంట్ చేస్తే డబ్బులు బాగా వస్తాయని చెప్పి, డబ్బులు తీసుకున్నాడు, నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించడం జరిగిందని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ , డిఎస్పీ యం.వెంకటరమణ తెలిపారు.ప్రజలు ఎవరు కూడా ఆన్లైన్ గేమ్స్, షేర్ మార్కెట్ ను నమ్మి మోసపోకూడదు సులభంగా డబ్బులు వస్తాయని నమ్మి ఎటువంటి ఆన్లైన్ యాప్స్ లో డబ్బులు ఇన్వెస్ట్మెంట్ చేయకూడదు సైబర్ మోసాలకు గురవకుండా జాగ్రత్తగా ఉండాలి అని సూచించారు.

# కల్వర్ట్ పనులు ప్రారంభం



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** గోదావరిఖని 33వ డివిజన్ లో మజీద్ కంప్లెక్స్ ప్రక్కన గల పొచమ్మ గుడి ప్రక్కన శిధిలవస్తుకు చేరి ప్రమాదకరంగా మారిన కల్వర్ట్ నిర్మించాలని అనేక మార్లు నగర పాలక సంస్థ అధికారులకు సింగరేణి అధికారులకు ప్రభావిత డివిజన్ పై ద్రుష్టి సారించాలని ప్రమాదకరంగా మారిన కల్వర్ట్ పై స్పందించి కల్వర్ట్ నిర్మాణ పనులు ప్రారంభించాలి మద్దెల దినేష్ కోరిన సంగతి తెలిసిందే స్పందించిన సింగరేణి యాజమాన్యం అర్జీ -1 జి ఎం లలిత్ కుమార్ కి ఈ సందర్భంగా దినేష్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

### మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో వెంకటయ్య (సీతారాములు)అనే వ్యక్తి నిన్న రాత్రి ప్రమాదానికి గురై మరణించడం జరిగింది .బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5000/- రూ ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబానికి మరియుబి ఆర్ ఎస్ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు.



ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం , బి ఆర్ ఎస్ పార్టీ కల్వకుర్తి అధ్యక్షులు విజయ్ గౌడ్ , కార్మిక నాయకులు సూర్య ప్రకాష్ , మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్య , నాయకులు మనోహర్ రెడ్డి , చిన్న, కల్వకుర్తి, బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డొక్కా లింగమయ్య , బి ఆర్ ఎస్ పార్టీ కల్వకుర్తి యువజన అధ్యక్షుడు వట్టేపు కిషోర్ ,మార్చాల బి ఆర్ ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరుమల్ల, విజయ్ , యువ నాయకులు సురేష్, రమేష్, గణేష్ కృష్ణ,హుస్సేన్ , మరియు గ్రామస్తులు ఉన్నారు.

# సమస్యలను పరిష్కరించండి.

### కాంట్రాక్టర్ వెంటనే వారి పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

### ప్రతి నెలా 7వ తేది లోపు వేతనాలు చెల్లించాలి.

### యూనిఫాం లు ఇవ్వాలి.

### మెడికల్ బుక్స్ అందజేయాలి.

### ఈ.ఎస్.ఐ సౌకర్యం కల్పించాలి.

**అగ్నిధారన్యూస్,( రామగుండం ):** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఏరియా హాస్పిటల్ లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి), ఆర్జీ వన్ బ్రాంచి అధ్యక్షులు కామ్రేడ్ ఎం.ఎ.గౌస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సింగరేణి ఏరియా హాస్పిటల్ లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అడిగి అనంతరం మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత రెండు నెలలుగా పెండింగ్ వేతనాలు కాంట్రాక్టర్ ప్రసాద్ చెల్లించడం లేదని, వెంటనే వారి పెండింగ్ వేతనాలు కాంట్రాక్టర్ ప్రసాద్ చెల్లించే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి ప్రతి నెలా 7వ తేది లోపు చెల్లించాల్సిన వేతనాలు 20వ తారీకు దాటినా కాంట్రాక్టర్ ఇవ్వడం లేదని, ఇది సరైన విధానం కాదని, దీని వల్ల వారు ఆర్థిక ఇబ్బందుల్లో పడుతారని, వెంటనే ప్రతి నెలా 7వ తేది లోపు వారికి వేతనాలు కాంట్రాక్టర్ చెల్లించె విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి ప్రతి నెలా వేతన స్లిప్ లు ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఇవ్వడం లేదని, వెంటనే వారికి వేతన స్లిప్ లు ప్రతి నెలా ఇచ్చే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం వారికి సి.ఎం.పి.ఎఫ్ స్లిప్ లు ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఇవ్వడం లేదని, వెంటనే వారికి పి.ఎఫ్ నిల్వ తో కూడిన సి.ఎం.పి.ఎఫ్ స్లిప్ లు ఇచ్చే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం వారికి యూనిఫాం లు ఇవ్వాల్సి ఉండగా, ఇంత వరకు ఇవ్వలేదని, వెంటనే వారికి యూనిఫాం లు ఇచ్చే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్పిటల్ లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెడికల్ బుక్స్ ఇవ్వాల్సి ఉండగా, ఇంత వరకు మెడికల్ బుక్స్ ఇవ్వలేదని వెంటనే వారికి మెడికల్ బుక్స్ ఇచ్చే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



అదేవిధంగా సింగరేణి సి అండ్ ఎండి గత కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు ఈ.ఎస్.ఐ సౌకర్యం కల్పించే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ఏరియా హాస్పిటల్ లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిచో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఏరియా హాస్పిటల్ డిపార్ట్మెంట్ సలహా దారు దాసరి అనిల్, ముఖ్య నాయకులు సంతోష్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం



**అగ్నిధార న్యూస్ ,(వాజేడు):** భారతీయ దళిత సాహిత్య అకాడమీ,( న్యూఢిల్లీ) వారు సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్ సేవలను గుర్తించి డిసెంబర్ 8 న దేశరాజధాని న్యూ డిల్లీ లో భగవాన్ బుద్ధ నేషనల్ అవార్డు ప్రధానం చేశారు.. దుర్గం నగేష్ అవార్డు స్వీకరించిన ములుగు జిల్లాకు వచ్చిన సందర్భంగా శనివారంరోజు వాజేడు మండలం మండపాక గ్రామంలో మార్షల్ దుర్గం నగేష్ కు పూల బొకే ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు అనంతరం వారు మాట్లాడుతూ మార్షల్ దుర్గం నగేష్ మానవతావాది బోధిసత్వ భగవాన్ బుద్ధ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ల స్ఫూర్తితో పే బ్యాక్ టు ది సొసైటీ నినాదంతో నిరుపేదలకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు మొదలైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇదే కాకుండా రాజ్యాంగం ద్వారాగా రావాల్సిన హక్కులు రిజర్వేషన్లు ప్రతి ఒక్కరు పొందాలని డాక్టర్ అంబేద్కర్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ తమ జ్ఞానాన్ని తమ సమయాన్ని తన సంపదను ఖర్చు చేస్తున్నారని తెలిపారు. వారికి ఢిల్లీ స్థాయిలో జాతీయ అవార్డు రావడం దళిత జాతి ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత దుర్గం నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమం కోసం వారి హక్కుల కోసం పోరాడుతున్న తనను భారతీయ దళిత సాహిత్య అకాడమీ జాతీయ సంస్థ తన సేవలను గుర్తించి బోధిసత్వ భగవాన్ బుద్ధ జాతీయ అవార్డును ఇవ్వడం సంతోషంగా ఉందని,, ఈ అవార్డు స్వీకరించడం వల్ల తనపై మరింత సామాజిక బాధ్యత పెరిగిందని, తన శక్తివంచన మేరకు సామాజిక సేవలో ముందుంటానని తెలిపారు.ఈ అవార్డు ప్రజల సహకారంతో రావడం జరిగిందని, ఎల్లప్పుడూ మీ అందరి ఆదరాభిమానాలు ప్రేమానురాగాలు ఇలాగే ఉండాలని కోరారు.. నేతకానీ ములుగు జిల్లా నాయకులు కుమ్మరి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేతకాని ఉద్యోగ సంఘం నాయకులు కుమ్మరి చిన వెంకటి, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , కొత్తగూడెం జిల్లా ఇన్చార్జి తడికల శివ, ఎంజెపీఏస్ ములుగు జిల్లా నాయకులు వి .సాంబశివరావు, బీఎస్పీ భద్రాచలం నియోజక వర్గ అధ్యక్షులు కొండ చరణ్, డిఎస్పీ ఏటూరు నాగారం మండల అధ్యక్షుడు శరత్ మండపాక నేతకాని పెద్దమనుషులు మహిళలు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా ఆంజనేయులు



**అగ్నిధార న్యూస్ మంథని :**మంథని సీనియర్ మరియు జూనియర్ కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా న్యాయవాది బొట్ల ఆంజనేయులు ని నియమించినట్లు తెలంగాణ లా సెక్రటరీ గవర్నమెంట్ లీగల్ లెజిస్లేటివ్ అఫైర్స్ జస్టిస్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ నియామక ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ నుంచి వెలువడ్డాయి.ఈ సందర్భంగా న్యాయవాది ఆంజనేయులు మాట్లాడుతూ.....తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్ బాబు , బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు , తోటి న్యాయవాదులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఇందిరమ్మ గృహాల సర్వే




### డి ఎల్ పి ఓ కొమ్మెర సతీష్.

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** ప్రతిరోజు 50 తగ్గకుండా ఇందిరమ్మ గృహాలను సర్వే పూర్తి చేయాలని మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ ఆదేశించారు. శనివారం కమాన్ పూర్ మండలంలోని పెంచికల పేట గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇల్లే సర్వేను ఆయన ఆకస్మికంగా సందర్శించేసి పరిశీలించారు. అలాగే సర్వే జరుగుతున్న క్రమంలో 100% ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఈనెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రతిరోజు సర్వేను ఉదయం ఏడు గంటలకు ప్రారంభించాలని కోరారు. సిబ్బంది సర్వే పూర్తయ్య వరకు ఎటువంటి సెలవులు పెట్టకూడదని అన్నారు. అనంతరం పారిశుధ్యం పనులను ఆయన పరిశీలించారు గ్రామంలో పూర్తిస్థాయిలో సందేశం చేయాలని ఎటువంటి చెత్తాచెదారం లేకుండా చూడాలని కోరారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం నాణ్యతంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి ముల్కూరి తిరుపతి ఉన్నారు.

# రిజర్వాయర్ పై పార్క్ ఏర్పాటు చేయండి

### సింగరేణి సి అండ్ ఎండిని కోరిన గ్రామస్తులు.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండలం గుండారం రిజర్వాయర్ కట్టపై పార్కు ఏర్పాటు చేయాలని సింగరేణి ఎండి బలరాం నాయక్ కు శనివారం గుండారం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ద్వారా వినతి పత్రం అందజేశారు. కాగా గ్రామ పరిధిలో గల మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు తాజా మాజీ ఉపసర్పంచ్ రాచకొండ చంద్రమౌళి గ్రామ ప్రజలు కోరారు. దీంతో ఆ వినతిపత్రాన్ని సీనియర్ విలేఖరి జబ్బర్ ఖాన్ ద్వారా హైదరాబాదులోని సింగరేణి భవన్లో వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. దీనికిగాను సి అండ్ ఎండి సానుకూలంగా స్పందించారు. గతంలో గుండారం రిజర్వాయర్ వద్ద బతుకమ్మ ఘాటును సింగరేణి సంస్థ ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందని సీఎండి కి వివరించడం జరిగింది. ఒకవేళ గుండారం రిజర్వాయర్ పై ట్యాంక్ మనతో పాటు పార్క్ ఏర్పాటు చేస్తే కమాన్ పూర్ ప్రజలకు అనువుగా ఉంటుందని అవినీతిపత్రంలో పేర్కొనడం జరిగింది. త్వరితగతిన నిధులు మంజూరు చేసి ఏర్పాటు చేయాలని కోరారు.

# గోదా దేవిని కొలిచే పవిత్ర మాసం ధనుర్మాసం

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
సిద్దిపేట లో టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయం
సిద్దిపేట లో 45 లక్షల తో వికాస తరంగిణి వేద భవన్
సిద్దిపేట లో వికాస తరంగిణి బలోపేతం కు కృషి చేస్తా.
త్వరలో సిద్దిపేట కు చిన్నజీయర్ స్వామి వారిని తీసుక వస్తా
సిద్దిపేట ఆధ్యాత్మిక ధార్మికత కు నెలవు.



**సిద్దిపేట :** సిద్దిపేటలో గోదా కళ్యాణం సుదర్శన యాగం కార్యక్రమం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ పరిది లో ఉన్న వికాస తరంగిణి ఆధ్వర్యంలో వేద భవన్ లో జరిగిన ధనుర్మాసం సందర్భంగా నిర్వహించిన శ్రీ గోదా దేవి కళ్యాణం, శ్రీ సుదర్శన యాగం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతు సిద్దిపేట గొప్ప ఆధ్యాత్మిక, ధార్మికతకు నెలవు అని, సిద్దిపేట లో కరీంనగర్ స్థాయి లో వేద భవన్ వికాస తరంగిణి భవనం అద్భుతంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎకరం ప్రభుత్వ స్థలం లో 45లక్షలతో అద్భుతం గా నిర్మించుకున్నామని, ప్రభుత్వ స్థలం లో ఇంత పెద్ద భవనం ఏర్పాటు కావడం రాష్ట్రం లోనే మొదటిదని. ఈ భవనాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సిద్దిపేట లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కోమటి చెరువు ప్రాంతం లో తిరుపతి శ్రీవారి ఆలయాన్ని నిర్మించుకుంటున్నామని త్వరలోనే 10కోట్లు టిటిడి నుండి మంజూరు అవుతాయని చెప్పారు. వికాస తరంగిణి ని మరింత బలోపేతం చేసుకుందాని సిద్దిపేట కు చిన్న జీయర్ స్వామి వారిని తీసుకొచ్చి ఈ భవనాన్ని ఘనంగా ప్రారంభం చేసుకుందామని చెప్పారు. ధనుర్మాసం గోదా దేవి కి ఎంతో ప్రత్యేక మాసమని, నెల రోజుల పాటు గోదా దేవి కోలుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సుదర్శన యాగం పూర్ణహుతి కార్యక్రమం, గోదా దేవి కల్యానోత్సవం లో పాల్గొన్నారు ఈ సందర్భంగా వేద పండితులు, వికాస తరంగిణి నిర్వహకులు ఆశీర్వదించారు.

# పెద్దపులి సంచారంతో స్థానికుల్లో భయాందోళన



**వరంగల్ :** మొన్నటివరకూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో పెద్దపులి సంచారం కలకలం రేపింది. రెండు చోట్ల మనుషులపై దాడులు సైతం జరగగా, ఓ ఘటనలో వ్యక్తి మృతి చెందగా.. మరోచోట తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులను పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. పెద్దపులి సంచారంపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి వెల్లి పరిశీలించి పులి సంచారం నిజమేనని తేల్చారు. పులి పాదముద్రలు గుర్తించిన తరువాత పులి సంచారంపై అధికారులు స్పష్టతనిచ్చారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామ శివారు పంట చేనులో పెద్దపులి అడుగులను రైతులు గమనించారు. ఉదయం రైతు మంకయ్యతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లిన వెళ్ళడంతో మిర్చి తోటలో పెద్దపులి అడుగుజాడలు కనబడటంతో రైతులు ఉలిక్కిపద్దారు. విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో ఎఫ్ అర్ అర్ ఓ రవికిరణ్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు పులి పాదముద్రలు పరిశీలించి పులి సంచారం నిజమని తేల్చారు. నల్లబెల్లి మండలం కొండాపురం, రుద్రగూడెం, గుంటూరు పల్లె పరిసర ప్రాంతాల్లో పులుల సంచారం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్ఆర్ఓ రవికిరణ్ తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవారే వరకు రైతులు పంట చేనులోకి వెళ్లొద్దని సూచించారు. ఒంటరిగా కూడా వెళ్లొద్దని కోరారు. అంతేకాకుండా రుద్రగూడెం గ్రామంలో పులి సంచరిస్తుంది ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలాలని దండోరా వేయించారు. అయితే 15 రోజులుగా ములుగు జిల్లా వెంకటాపురం, మంగపేట మండలాల పరిధిలో పెద్దపులి సంచరిస్తుందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో ఏజెన్సీ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పులి సంచారంపై ఫారెస్ట్ అధికారులు తర్జన భర్జన పడ్డారు. రెండు రోజుల క్రితంపులి సంచారం పై ఎలాంటి నిజం లేదని రేంజర్ చంద్రమౌళి చెప్పారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో రైమ్స్ ఫెస్ట్




**పెద్దపల్లి :** పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో శనివారం రైమ్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ప్రీ ప్రైమరీ విద్య అనేది అత్యంత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నర్సరీ, ఎల్ కె జి, యుకెజి తరగతుల్లో టీచర్లు బోధించిన అంశాలు సరిగ్గా నేర్చుకుంటే వారు ముందు తరగతుల్లో ఇంకా బాగా రాణించే అవకాశం ఉందన్నారు. రోజూ పుస్తకాలతో కుస్తీ పట్టి, చదివి చదివి అలిసిపోయిన మన చిన్నారుల మానసిక ఆనందం కోసం రైమ్స్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం గాయత్రి విద్యా సంస్థల కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ స్థాయిలో రైమ్స్ నేర్పడం వల్ల పిల్లలలో జ్ఞాపక శక్తి, విషయ గ్రహణ శక్తి, హావభావాలు, వివిధ పదాలు, వాటిని పలికే విధానం, సభ్యత సంస్కారం, పెద్దలతో ప్రవర్తించే విధానం తదితర అంశాలు సులభంగా నేర్చుకునే అవకాశం ఉందని తెలిపారు. మనం రైమ్స్ ని నేర్పించడం ద్వారా పిల్లలకు సరదాతో పాటు వారికి తెలియకుండానే భాషాపరమైన అంశాల్లో పట్టు సాధించి, వారిలోని భయం తొలగి వారు తమ భవిష్యత్ లో మరింతగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. రైమ్స్ ఫెస్ట్ ని విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ప్రీ ప్రైమరీ టీచర్లను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో చిన్నారులు చిన్న చిన్న పదాలతో, ముద్దు ముద్దు మాటలతో చేసిన ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు పఠించిన భగవద్గీత శ్లోకాలు అందరినీ మంత్రముగ్దులను చేశాయి. రంగురంగుల వేషధారణలో వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు తమ బుడి బుడి అడుగులతో ఇంగ్లీష్ , హిందీ మరియు తెలుగు రైమ్స్ కి అనుగుణంగా చక్కని హావభావాలతో నృత్యం చేయడం చూసి ఆహుతులు సంభ్రమాశ్చర్యాలకు లోన య్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, పోషకులు పాల్గొన్నారు.

# ప్రతిమ హాస్పిటల్ సేవలను వినియోగించుకోండి

### ఆసుపత్రి ఉచిత బస్సు పునరుద్ధరణ

**కమాన్ పూర్ :** కరీంనగర్ ప్రతిమ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కే. కౌశిక్, అసిస్టెంట్ మేనేజర్ రాజేందర్ లు కోరారు. శనివారం రామగిరి మండలంలో పలు గ్రామాలలో మార్కెటింగ్ టీం పర్యటించి ఆసుపత్రి సేవల గురించి తెలియజేశారు. మంథని పరిసర ప్రాంత ప్రజలకు గత కొద్ది రోజులుగా ప్రతిమ ఆసుపత్రి ఉచిత బస్సు నిలిపివేయడం జరిగింది. తిరిగి ఈ నెల 26 వ తేదీ నుండి పునరుద్ధరించబడిందని తెలిపారు.. కావున ప్రతిమ ఆస్పత్రి ఉచిత బస్సులో వచ్చే పేషెంట్లు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు మంథని ఫైర్ స్టేషన్ వద్దకు రాగలరు. తమ వెంట రేషన్ కార్డు తెలుపు కార్డు తీసుకొనిరాగలరు. మరిన్ని వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సదానందం 9705309496, ఫౌండేషన్ రాజు కుమార్ 6281840860 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు. ప్రతిమ హెల్త్ ప్యాకేజీల కింద తల్లి బిడ్డ సంరక్షణ పథకం, గ్యాస్ట్రోఎంటరాలజీ హెల్త్ ప్యాకేజ్, హార్ట్ హెల్త్ ప్యాకేజ్, డయాబెటిక్ హెల్త్ ప్యాకేజ్, యూరాలజీ హెల్త్ ప్యాకేజీలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు మెడికల్ సౌకర్యం కలదని తెలిపారు. ఈ కార్యక్రమంలోప్రెస్ క్లబ్ నాయకులు పీవీరావు, కొండ్ర సుకుమార్, కాపర్తి అభిలాష్, స్థానిక నాయకులు బుడిగే క్రాంతి,ఒర్రె సురేష్, చిలువేరివెంకటేష్,ప్రతిమ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జనగామ. సదానందం,నాగరాజు, రాజకుమార్,సైయ్యదు హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



# మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



## రాంగు రూట్లో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

## ట్రాఫిక్ ఎస్ఐ రవికాంత్

**అగ్ని ధార న్యూస్ సుల్తానాబాద్ :** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని ట్రాఫిక్ ఎస్ ఐ రవికాంత్ అన్నారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ సిఐ అనిల్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు... ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి, వాహనాల పత్రాలను పరిశీలించారు, రాంగ్ రూట్లో ప్రయాణాలు నేరమని , వాహనదారులు రాంగ్ రూట్లో దొరికితే కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు, వాహనాలు నడిపేటప్పుడు మెల్లగా వెళ్లాలని, అతివేగంతో ప్రయాణిస్తే ప్రమాదాల బారినపడి కుటుంబ పరంగా , ఆర్థికపరంగా నష్టపోతారని అన్నారు , వాహనాలు జాగ్రత్తగా నడిపి గమ్యం చేరుకోవాలని వాహనదారులకు సూచించారు. ఎస్సై రవికాంత్ తోపాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయ నూతన పాలక మండలి



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్. మండల కేంద్రం లోని వీరభద్రేశ్వర ఆలయ నూతన పాలక మండలిని ఎన్నుకోవడం జరిగిందని సభ్యులు తెలిపారు. నూతన సభ్యులుగా సింగీతం గ్రామానికి చెందిన బ్యాగరి కృష్ణవేణి వీరేశం ఎన్నిక కావడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర దేవాలయ శాఖ జీవోను విడుదల చేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర దేవాలయ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో దేవాదాయ శాఖ సభ్యులుగా నియమించినందుకు, పార్టీకి కష్ట కాలంలో సేవ చేసినందుకు ఉన్నత పదవులు అందించడం వల్ల మంత్రికి ఎంపీ సురేష్ కుమార్ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంజయ్య కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## చేనేత వస్త్ర ప్రదర్శన

**హైదరాబాద్ :** చేనేత కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వాలు చేస్తున్న కృషికి తమ వంతుగా చేనేతకారులను ప్రోత్సహించేందుకు మరిన్ని ప్రదర్శనలు నిర్వహించాలని సామాజికవేత్త శ్రీదేవి చౌదరి అన్నారు. జూబ్లిహిల్స్ లో రూమ్9 పాప్ అఫ్ స్టోర్ లో ఏర్పాటు చేసిన 3-రోజుల తోపాటు చేనేత వస్త్ర ప్రదర్శన సామాజికవేత్త శ్రీదేవి చౌదరి, సెలెబ్రిటీ సీక్రెట్స్ ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి కూడా కలిసి ప్రారంభించారు. సెలెబ్రిటీ సీక్రెట్స్ , రూమ్9 ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి మాట్లాడుతూ తమ వంతు కృషిగా చేనేతకారులకు రూమ్ 9 వేదికగా, ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. భారతీయ సంస్క-తిలో చేనేతకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కొనసాగుతున్న ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో ని అనేక జిల్లాల నుండి ఇక్కడ హ్యాండ్ లూమ్ , పట్టు, కాటన్, డ్రెస్ మేటీరియల్స్, హ్యాండిక్రాఫ్ట్స్ వంటి వేలాది రకాల వస్త్రోత్పత్తులు అందుబాటులో ఉంచారని వివరించారు.

## ఆస్తి కోసం ఇంత తెగిస్తారా

**కరీంనగర్ :** రక్తం పంచుకుని పుట్టిన బిడ్డలు కాకున్నా కంటికి రెప్పలా చూసుకుంటారని కలలు కన్నదా తల్లి.. కాటికి చేరిన తరువాత కూడా కన్న తల్లిలా అంత్యక్రియలు చేస్తారునుకుంది. అంతిమ ఘడియల్లో ఎలాంటి జీవనం సాగించిందో ఏమో కానీ చివరకు అంత్యక్రియలకు కూడా నోచుకోలేకపోయిందా అవ్వ.. ఆస్తిపాస్తులు పంచుకునే వరకు బాగానే ఉన్నా అవసాన దశకు చేరుకున్న ఆమెపై పెంచుకున్న బిడ్డలు చూపిన వివక్ష స్థానికులను కలిచి వేసింది. ఆస్తులు సగం సగం పంచుకున్నందున నెలకొకరు అవ్వకు ఇంత బువ్వ పెట్టాలని నిర్ణయించుకున్నారు. అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువు ఒడిలో చేరిన ఆమె శవాన్ని కనీసం సొంత ఇంటిలోకి కూడా తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. జగిత్యాల జిల్లా కేంద్రంలో హృదయ విదారకరంగా చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికులను విస్మయపరిచింది. జగిత్యాల పట్టణంలోని సాదుల సత్తవ్వ (85) భర్త లక్ష్మణ్ 20 ఏళ్ల క్రితం మరణించాడు. వీరికి పిల్లలు లేకపోవడంతో సత్తవ్వ తోటి కోడలు కొడుకులనే తన కొడుకులుగా భావించింది. తన ఆస్తులు కూడా వారిద్దరికి పంచి ఇచ్చింది. సొంత ఇంటితో పాటు పట్టణంలో ఉన్న భూమిని కూడా వారికి ముట్టజెప్పిన సత్తవ్వను వాయిదాల పద్దతిలో పెంపుడు కుమారులిద్దరూ నెలకొకరి చొప్పున చూసుకుంటున్నారు. అయితే ఇటీవలే అనారోగ్యం బారిన పడిన సత్తవ్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఆమె మృతదేహాన్ని అంబూలెన్స్‌లో సొంత ఇంటికి తీసుకొచ్చినప్పటికీ ఇంటికి తాళం వేసి ఉండడంతో కొన్ని గంటల పాటు అలాగే ఉంచారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని ఇంటికి వేసిన తాళం పగలగొట్టించి సత్తవ్వ శవాన్ని లోపల ఉంచారు. అయితే ఓ పెంపుడు కొడుకు ఇంట్లో నెల రోజుల్లో వివాహం ఉన్న కారణంగా తన ఇంటికి తీసుకెళ్లలేకపోతున్నానని వివరించగా, మరో కొడుకు అటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం స్థానికులను విస్మయపరిచింది. సత్తవ్వ ఆస్తి విషయంలో రాజీ పడకుండా వాటా తీసుకున్న పెంపుడు కొడుకు కనీసం ఆమెను చివరి చూపు చూసేందుకు కూడా రాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న మహిళా ఎస్సై గీతారెడ్డి సత్తవ్వ పెంచుకున్న ఓ కుమారునికి ఫోన్ చేసినప్పటికీ ఆయన మాత్రం సత్తవ్వ మృతదేహం వద్దకు రావడానికి నిరాకరించాడు. పెంచుకున్న తల్లి చనిపోతే కూడా ఇలా వ్యవహరించడం ఏంటని ఎస్సై మందలించినా కూడా అతనిలో మార్పు రాలేదు. చనిపోయిన శవాన్ని ఇలా వదిలేసి వెళ్లడం సమంజసం కాదని, భవిష్యత్తు తరాలకు ఇచ్చే సందేశం ఇదేనా అని వ్యాఖ్యానించినప్పటికీ ఆయన మాత్రం స్పందించలేదు. సత్తవ్వ ఆస్తులను పంచుకుని ఆమెను పట్టించుకోకపోవడంపై ఆగ్రహించిన ఎస్సై ఆమె ఆస్థిని స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు సిఫార్సు చేస్తానని కూడా హెచ్చరించారు. సత్తవ్వ ఆస్తిని పంచుకున్న పెంపకం బిడ్డలు ఇద్దరు ఉన్నప్పటికీ ఆమె అంత్యక్రియలు మాత్రం కుటుంబ సభ్యులు నిర్వహించకపోవడం విచిత్రం. ఓ కొడుకు ఇంట్లో వివాహం ఉందన్న కారణం, మరో కొడుకు అటుగా రాకపోవడంతో బయటి వ్యక్తుల ద్వారా అంతిమ సంస్కారం నిర్వహించినట్టుగా తెలుస్తోంది. తన కడుపున పుట్టిన బిడ్డలు కాకున్నా.. తన కుటుంబానికి చెందిన వారే తన బిడ్డలుగా భావించిన సత్తవ్వ అంత్యక్రియలు చేసేందుకు కూడా ముందుకు రాకపోవడం పట్ల జగిత్యాల వాసులు విస్మయం వ్యక్తం చేశారు.



# బేబీ బంప్‌తో సమంత

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ చెన్నై సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్ తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫొటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫొటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.

# విజయ్ దేవరకొండతో మమితా బైజు



ప్రస్తుతం టాలీవుడ్ లో పదుల సంఖ్యలో కొత్త భామలు ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఒకటి రెండు సినిమాలతోనే క్రేజ్ తెచ్చుకుంటూ ఆఫర్స్ అందుకుంటున్నారు. అందం, అభినయంతో కుర్రకారు మనసులు దోచేస్తున్నారు. అలాగే పై ఫొటోలో ఉన్న బ్యూటీ కూడా.. ఈ ఫోటోలోని అమ్మడు ఎవరో గుర్తుపట్టారా.? నడుమందాలతో కుర్రాళ్లకు చెమటలు పట్టిస్తున్న ఈ బ్యూటీ చాలా మంది అభిమాన హీరోయిన్. ఒకే ఒక్క సినిమాతో కుర్రాళ్ళ గుండెల్లో స్థానం సంపాదించుకుంది. ఈ చిన్నది తెలుగులో ఒక్క సినిమాతోనే ఓవర్‌నైట్ స్టార్‌గా మారింది. చిన్న వయస్సులోనే నటిగా ఎంట్రీ ఇచ్చి అదరగొట్టింది. మన తెలుగు అమ్మాయి కాదు కానీ అచ్చం మన తెలుగమ్మాయిలానే ఫీల్ అవుతుంటారు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? మలయాళ బ్యూటీ.. మాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించి.. తన నటనతో మెప్పించింది. ఇక ఈ మధ్య మలయాళంలో విడుదలైన 'ప్రేమలు' మూవీతో.. అటు మాలీవుడ్.. ఇటు టాలీవుడ్‌లో కుర్రాళ్లలో పిచ్చ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించింది. ఇంతకీ ఆమె ఎవరో మీకు గుర్తొచ్చి ఉండొచ్చు.! ఈ ముద్దుగుమ్మ ఎవరో కాదు మమితా బైజు. 'ప్రేమలు' మూవీలో రేణు రాయ్ అనే మెచ్యూర్డ్ విమెన్ పాత్రలో ఈ కేరళ కుట్టి తన నటనతో మెప్పించింది. ఎంతోమంది ప్రేక్షకులకు చేరువైంది ఈ బ్యూటీ. ఈ సినిమాలో ఆమె నటనకు కుర్రాళ్లు ఫిదా అయిపోయారు. ఈ క్రేజీ హీరోయిన్ కేరళలోని కొట్టాయంలో జన్మించింది. 2017లో 'సర్వోపరి పాలక్కరన్' అనే చిత్రంతో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 'హనీ బీ', 'డాకినీ', 'కృష్ణం', 'స్కూల్ డైరీ', 'ది ఇంటర్నేషనల్ లోక్ స్టోరీ', 'వికృతి', 'కిలోమీటర్స్ అండ్ కిలోమీటర్స్', 'ఆపరేషన్ జావా', 'సూపర్ శరణ్య' లాంటి చిత్రాలతో మెప్పించింది. 'ప్రేమలు' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. కాగా, ప్రస్తుతం తెలుగులో ఈ బ్యూటీ విజయ్ దేవరకొండ సరసన ఓ చిత్రంలో నటించబోతున్నట్టు టాక్ వినిపిస్తోంది.



# మలయాళం బ్లాక్ బస్టర్ 'మార్కో' తెలుగు ట్రైలర్ రిలీజ్

'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'ఖిలాడీ' 'యశోద', మాలికాపురం వంటి చిత్రాలతో తెలుగు ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం మార్కో మైఖేల్, ది గ్రేట్ ఫాదర్ సినిమాల ఫేమ్ హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. 5 రోజుల్లో రూ.50 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమాను తెలుగులో జనవరి 01న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.



# మహేశ్ బాబు - రాజమౌళి సినిమాలో బాలీవుడ్ బ్యూటీ..!

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో %ూావీదీ% 29 మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. ఇక షూటింగ్ ప్రారంభం కావడమే ఆలస్యం. మూవీ లవర్స్ కూడా ఈ సినిమా కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఇప్పటికే హింట్ ఇచ్చాడు. అయితే మహేశ్ బాబు సరసన బాలీవుడ్ బ్యూటీ ఛాన్స్ కొట్టేసినట్లు ఫిలిం ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ప్రియాంక చోప్రా ఈ మూవీలో నటిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత %ూావీదీ% 29 మూవీ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ కూడా పూర్తయినట్లు సమాచారం. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీతోపాటు, నగర శివార్లలో కొన్ని భారీ సెట్లను కూడా రూపొందించారు. తొలి షెడ్యూల్ వాటిలోనే జరుగుతుందట. తర్వాతి షెడ్యూల్ విదేశాలలో ఉంటుందట. ఈ సినిమా అధికారిక ప్రకటనకు సంబంధించిన గ్లింప్స్ ఇప్పటికే సిద్ధమైందని, త్వరలో ఇతర నటీనటుల్ని కూడా పరిచయం చేసే అవకాశం ఉందని చిత్రబృందం చెబుతున్నది. అనవాయితీ ప్రకారం త్వరలోనే ఓ ప్రెస్‌మీట్‌ను కూడా రాజమౌళి పెట్టనున్నారట. వెయ్యికోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా ఈ సినిమాను నిర్మాత కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com